POSTAL REGD.NO.PRAKASAM/2026-2028
REGD.NO. APTEL/26/A0220
ESTABLISHED : 1983
ఆగస్టు 2026
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక
సంపుటి: 44 సంచిక: 04



## అవధూత శ్రీ వెంకయ్య స్వామి ఆరాధన

ఆగస్టు 24, 2026

# ఈ నెల పండుగలు

ఆగస్టు 10 - స్వామి వివేకానంద ఆరాధన [తిథి - ఆషాడ బహుళ త్రయోదశి]


ఆగస్టు 17 - హజరత్ తాజుద్దీన్ బాబా ఆరాధన

ఆగస్టు 21 - శ్రీ సిద్ధారూఢ స్వామి ఆరాధన

ఆగస్టు 24 - అవధూత శ్రీ వెంకయ్య స్వామి ఆరాధన

ఆగస్టు 27 - శ్రీ ఆనందమయి అమ్మ ఆరాధన

*(సవరణ : గత సంచికలో శ్రీ స్వామి వివేకానంద ఆరాధన (ఆషాడ బహుళ త్రయోదశి) తేదీ జూలై 12 అని పొరపాటున ప్రచురించబడింది. పాఠకులు దయచేసి గమనించగలరు.)*






# సర్వమత సమరస సారం – శ్రీ సాయి 'మతం'

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

ప్రపంచంలో ఎన్నో మతాలూ, ఆధ్యాత్మ సాంప్రదాయాలు మానవ మనుగడకని వెలిశాయి. కాని కాలాంతరంలో అవి శిథిలయమయ్యాయి. పరిశుద్ధ సాంప్రదాయానికి బాహ్యమైన అంశాలెన్నో ఆచారాలుగానూ, సాంప్రదాయాలకు విభిన్న వ్యాఖ్యానాల రూపంలోనూ అందులో చొచ్చుకొని సత్యమైన పథం మరుగుపడినది. ప్రతి మతంలోనూ మతాంతరాలు, వాటి మధ్య విభేదాలు, చీలికలూ ఏర్పడాయి. కాలగతిలో ఇది అనివార్యం.

మతేతరమైన సిద్ధాంతాలకూ ఈ విభేదం తప్పడం లేదు. కార్ల్ మార్క్స్ సిద్ధాంతానికి రష్యా ఒక వ్యాఖ్యానాన్నిస్తే, జెకొస్లోవేకియా మరొక వ్యాఖ్యానాన్ని, మావో కాలపు చైనా, క్యూబా, అర్జెంటీనా, హంగరీలు వేర్వేరు పంథాలుగా యీ సిద్ధాంతాన్నే ఏర్పరచుకొన్నాయి. మతాల విషయంలో కాలగతి ఎక్కువైంది గనుక ఈ మార్పుల వైవిధ్యమూ, మాలిన్యము మరీ ఎక్కువయ్యాయి. దీనినే భగవద్గీత 'ధర్మగ్లాని' యని చెప్పి, అట్టి సమయాలలో దైవమే అవతరించి తిరిగి పరిశుద్ధ మూలధర్మాన్ని ఉద్ధరిస్తాడని గూడా చెబుతుంది.

ఈ విషయాన్నే చరిత్రలో అనేకమంది బుద్ధులవతరించడంగా బౌద్ధము, తీర్థంకరులవతరించడంగా జైనము చెప్పాయి. బైబిల్ లో ఏసుక్రీస్తు ప్రాచీన ధర్మాలను పరిపూర్తిగావించడానికి



అంటే ఆచరణలో వాటి పూర్ణత్వాన్ని ప్రకటించడానికి తాను అవతరించినట్లు చెప్పారు. దీనిని గురించే ఖురాన్ షరీఫ్ లో 'అల్లా ఎందరో ప్రవక్తలను వివిధ కాలాల్లో వివిధ దేశస్థుల మధ్యకు పంపారని, వారందరూ ప్రకటించినది ఒకే సత్యమైన పథమని,

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:44 ఆగస్టు - 2026 సంచిక:04

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన "సాయిబాబా"

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | సర్వమత సమరస సారం - శ్రీ సాయి 'మతం' | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | పరిప్రశ్న | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 06 |
| 03. | "లేదురా ఇటువంటి భూదేవి ఎందు" "లేరురా మనవంటి పౌరులింకెందు!!" | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 07 |
| 04. | వార్తాలాపము | శ్రీమతి అడిదం వేదవతి | 12 |
| 05. | భగవాన్ శ్రీ భరద్వాజ | శ్రీమతి శ్రీదేవి | 15 |
| 06. | మాతృదేవి స్మృతులు | శ్రీమతి సుభాషిణి | 18 |
| 07. | శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు | శ్రీమతి శ్రీదేవి | 20 |
| 08. | ద్వారకామాయి అనుభవమండపము | శ్రీ కాశిన సురేష్ | 23 |
| 09. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీమతి జయప్రద | 26 |


స్థలాభావం వల్ల ఈ సంచికలో 'బుద్ధ ధ్యాన హృదయము' ప్రచురింపబడడం లేదు.


చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Kondaiah Bunk Street, Kothapeta,
Ongole, Prakasam District, A.P. - 523002
Phone No. 08592 233271
**www.saibharadwaja.org**



చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

విడి ప్రతి : ₹10-00
సంవత్సర చందా : ₹100-00


సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

కాని కాలాంతరంలో ఆయాధర్మాలు శిథిలం చెందాయని, తిరిగి ఆ సనాతనధర్మమే మరలా ఖురాను ద్వారా మానవాళికి వెళ్ళడిస్తున్నామనీ' అన్నట్లు వ్రాయబడియున్నది. ఈ విషయం మన ప్రాచీన ధర్మశాస్త్రాల్లో ధర్మాచరణ విషయంలో శంక గల్గితే సర్వజ్ఞులైన మహనీయుల నడవడే మార్గదర్శకమని స్పష్టంగా చెప్పబడ్డది. పరిపూర్ణులైన మహనీయుల అవతరణ ప్రయోజనాలలో ముఖ్యాతిముఖ్యమైనదిదే. మృతప్రాయమైన మూఢాచరణను పరిశుద్ధమొనర్చి దానినాచరించి, సజీవమొనర్చి, తిరిగి ప్రజల ఆచరణలో దానిని స్థాపించడమే.

ఈ రెండంశాల దృష్ట్యా శ్రీ సద్గురు సాయినాథుని అవతరణ చరిత్రలో నేటి వరకూ మరెవ్వరూ చేయలేనంత విశేషమైన ప్రాధాన్యత కల్గియుంది. ఆయనలో అన్ని మతాలకూ మూలమైన సనాతన ఆధ్యాత్మతత్వం అవతరించింది. అందుకనే ఆయనలో సర్వమతాలలోని మహోన్నతమైన సమన్వయం కనబడుతుంది. ఆయన వేషం, భాష, యాస, తరచూ 'అల్లామాలిక్' అని స్మరిస్తూండటం. మసీదులో నివసించడం, ముస్లిములతో కలిసి 'ఫాతిహా'' అనే ప్రార్థనను పఠించడం, శిరిడీ వచ్చిన మొదటిరోజుల్లో తరచు ఉర్దూ, అరబ్బీ భాషల్లోని భక్తిపాటలు పాడుతూ వుండటం వల్ల కొందరు ఆయనను ముస్లిం అని భావించారు. కాని ఆయన మసీదులో నిరతాగ్నిని, తులసిని ప్రతిష్ఠించి, ద్వారకామాయి అని మసీదుకు పేరు పెట్టి తానెంతమేరకు ముస్లిమో అంతమేరకు హిందువనికూడ నిరూపించుకొన్నారు. ధూలియాకోర్టు న్యాయవాదితో తమ మతం కబీరని, కులం పర్వర్దిగర్ (అంటే దైవం) అని చెప్పడంతో తమ తత్వాన్ని వెల్లడి చేసారు సాయి. "ఈ సద్బ్రాహ్మణుడు లక్షలాది మానవులను శుభ్రమార్గాన నడిపిస్తాడు. ఇది బ్రాహ్మణ మసీదు" అని ద్వారకామాయిని పేర్కొనడంలోని, చమత్కారం ఇదే!

అయితేకేవలంమతసామరస్యాన్నిమాత్రమేఆయన బోధించలేదు. ఆధ్యాత్మ విద్య మత సాంప్రదాయాల కతీతమని ఆయన బోధించదలచింది. ఆయన రానున్న యుగానికి ప్రారంభకర్త. అందుకే ఆయన ఆ నూత్న ఆధ్యాత్మిక యుగానికి అవసరమైన కార్యం నెరవేర్చి ప్రపంచ చరిత్రలో నూతన అధ్యాయమనదగు రష్యన్ విప్లవ సమయంలో (1918 అక్టోబరు) భౌతిక ఉపాధిని త్యజించి, తమ నిజతత్వంలో నిలచారు. ఆ విప్లవంతో చారిత్రకమైన మత సాంప్రదాయాలకు, కాలాంతరంలో వాటిపేరున పేరుకొన్న మతమౌఢ్యానికి భరతవాక్యం పలుకనున్న కాల మాసన్నమైనదన్న సూచన ఆయన జీవన విధానం. మత సాంప్రదాయాల కతీతమైన శుద్ధ ఆధ్యాత్మ సాంప్రదాయాన్ని ఆయన చాటారు. అందుకే ఆయన తానుగ ఏ మతధర్మాన్ని బోధించలేదు. నిరసించలేదు. అన్ని మతాలలోని మౌఢ్యాలను నిష్కర్షగా నిరసించారు!

హిందూ ఆచారాలను మసీదులో పాటిస్తున్నందుకు ఒక ముస్లిం "మీరు ముస్లింలయిగూడా యిదేమిటి?" అన్నప్పుడు ఆయన. "దేశాన్ని బట్టి వేషం!" "జైసా దేశ్ వైసా వేష్" అన్నారు. అంటే దేశకాలాలను బట్టి వివిధ వేషాలు ధరించిన ఒకే ఆధ్యాత్మ సూత్రం తామని భావం కాదా? 'ఏకం సత్ విప్రాః బహుధా వదంతి" అన్న ఆనాటి ఋషివాణి కాదా యిది? అల్లా నుండి ఎల్లప్పుడూ అందరు ప్రవక్తల ద్వారా ప్రకటమయినదని ఖురానులో చెప్పిన వాణి కాదా యిది? ఆధ్యాత్మికత మతభేదాల కతీతమని చెప్పిన వాణికాదా? అదే సాయి సాంప్రదాయానికి మూల స్తంభం. దేశ, మత భేదాల కతీతమైనది – వర్ణ భేదానికతీతం కదా? అందుకే శిరిడీలో నేటికీ పూజల్లో పూజారి సహకారమనవసరం అనుకొనేవారి సౌలభ్యం కోసం పూజారులున్నా, అన్ని మతాల వారువచ్చి యథేచ్ఛగా సాయిసమాధిని తాకి, వారి వారి మతానుసారం ప్రార్థించుకుంటారు. ఈ సూత్రాన్ని ఉల్లంఘించిన మందిరం సాయి మందిరం కానేరదు. ●


# పరిప్రశ్న

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

**ప్రశ్న :- మీరు తరచూ 'శ్రీ సాయి లీలామృతము' శ్రీ గురుచరిత్ర' పారాయణ చేయమని చెబుతారు. వేరు గ్రంథాలు పారాయణ చేయడానికి అవకాశమున్నదా? పారాయణ చేయలేని వారికెలా?**

**-బాబా ప్రసాద్, కాళహస్తి**

**జవాబు :-** సాయి చరిత్ర కరెంటు సప్లైలాగా ఎంతో శక్తివంతమైనది. కాని సాయిబోధ అనే పథ్యం తెలుసుకోకుంటే ఎంతో చెడుకు కారణం కాగలదు. కుశాభావువలె చిల్లర మహిమలు చేసి నిజమైన సద్గురువెలా వుంటాడో తెలియని అమాయకులను నకిలీ గురువులు మోసం చేస్తున్నారు. ఇది క్రమంగా ఆస్తికానికి దెబ్బ అవుతుంది. ఇలాటివారు అందరూ బాబా పేరిటే చేస్తున్నారు. కనుక బాబా ఉపదేశము దానిని నిరూపించే లీలలు గల చరిత్ర సామాన్యులకర్థమయ్యే సరళమైన భాషలో శ్రీ శివనేశన్ స్వామి కోరి వ్రాయించారు. పత్రి – సేలూవంటి కట్టుకథలు చోటుచేసుకోరాదని వారి భావం. లీలలు కూడా ఎక్కువ సంఖ్యలో ఒకరకంగా కూర్చితేనే బాబా గురించి సరైన భావమేర్పడుతుంది. సమాధి అనంతరం లీలలు కూడా నేటి భక్తులకవసరం. పామరులకుండే అపోహలెన్నో తొలగించే లీలలెన్నో బాబా చేశారు. ఇన్ని ప్రయోజనాలు నెరవేరేలా, ఇవన్నీ భక్తులకు మొదటినుండే తెల్పే ఆశయంతోనే సాయిలీలామృతం పారాయణ చేయమని చెబుతాను. సాయి సాంప్రదాయంలో 'గురుచరిత్ర' కెంతో ప్రాధాన్యమున్నది. 'శ్రీ గురుచరిత్ర' కూడా సద్గురువు కృప పొందడానికి సాధనమని తెల్పే గురుచరిత్ర గ్రంథాలు



కూడా లేవు అదొక కారణం.

చదువురానివారు శ్రవణం చేయాలి. చదువుకున్న వాళ్ళు సాటివారి శ్రేయస్సు గోరి ఎంత శ్రమించైనా వారికి విన్పించాలి. అదే నిజమైన సాయిభక్తి, సర్వజీవుల శ్రేయస్సూ కోరడమంటే. అట్టివారికి మాత్రమే ముక్తి లభిస్తుందని భగవద్గీత చెబుతుంది. హరికథలు గూడ అందుకే వ్రాయించడానికి ప్రయత్నిస్తున్నాము. కథాగానాలు చేయిస్తున్నాము. ●

*(ఆగస్టు 2011 సాయిబాబా మాసపత్రిక నుండి)*

# "లేదురా ఇటువంటి భూదేవి ఎందు"
# "లేరురా మనవంటి పౌరులింకెందు॥"

***పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ***

'మాతృదేవో భవ, పితృ దేవో భవ, ఆచార్యదేవో భవ' అని పెద్దల వాక్యం. ఇందులో ప్రథమ స్థానం వారు మాతృదేవికే యిచ్చారు. కారణం మనకు తెలిసినదే. మనం జన్మించడానికి తల్లిదండ్రులిరువురూ కారణభూతులే అయినప్పటికీ ఆ బీజాన్ని తన గర్భంలో యిముడ్చుకుని పరిపూర్ణ శరీరం గల జీవిగా పపంచంలోకి తీసుకువచ్చేది మాత్రం మాతృమూర్తియే. ఆ మాతృదేవత యొక్క గర్భపరిస్థితి, శారీరక పరిస్థితి, మానసిక పరిస్థితి సరిగా లేకపోయినట్లయితే సరియైన జీవునిగా, అంటే మానసిక, శారీరక వ్యవస్థ సరిగా పనిచేసే విధంగా, మనం జన్మించలేము. కనుక అట్టి మాతృమూర్తిదే ప్రథమ స్థానం అని గుర్తించక తప్పదు.

ఈ విశాల విశ్వంలో అనేక గ్రహగోళాలు సంచరిస్తూ వుంటాయి. కానీ ఈ భూగోళం మీద మాత్రమే అనేక రకాలైన జీవరాశి ఉత్పన్నం కావడానికి అనుకూల పరిస్థితి ఏర్పడి వున్నది. ఈ భూగోళం మీద వివిధ రకాలైన జీవరాశులు వున్నప్పటికీ, భారతవర్షంలోని భారత ఖండంలో వున్నటువంటి జీవరాశి ప్రత్యేక స్థానాన్ని ఆక్రమిస్తుంది. ఇందులో వున్న వృక్ష సంపదగాని, జంతుజాలంగానీ, జలవనరులుగానీ మరెక్కడా అంతగా కనిపించవు. మూడు వైపులా మహా సముద్రము, ఉత్తరాన తనకెవరూ సాటిలేరన్న ధీమాతో నిలబడివున్న ఎత్తైన హిమవత్పర్వత శ్రేణి, హిమాలయాలనుంచి కిందకు జాలువారుతున్న అనేక ఔషధులతో కూడిన పవిత్ర గంగానది; గోదావరి, కృష్ణ, కావేరీ, నర్మద, తపతీ మొదలైన మహానదీ నదములు, వాటి ఉపనదులు, ఎన్నో జలపాతములు, సెలయేరులు, నీటి బుగ్గలు – ఈ పవిత్ర భూమిలో ఎన్నో! వాటితో సస్యశ్యామలంగా వృద్ధి చెందే వృక్షజాలముతోనూ, పైరు పంటలతోనూ నిత్యనూతనంగా, అత్యంత రమణీయంగానూ విలసిల్లే ఈ భరతమాత సౌందర్యాన్ని వర్ణించనెవరితరము? ఇవన్నీ ఎప్పుడైతే వున్నాయో ఇక యిక్కడ జీవరాశికి కొదవ ఏముంటుంది? అనేక రకాలైన, చిత్ర విచిత్రములైన జీవరాశులలో ఈమె అనంత సంతతిగల మాతృమూర్తి. ఈమె ఎప్పుడూ నిండు చూలాలు, నిత్య బాలింతరాలు గూడ.

అంతేగాదు, వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలు మొదలగు అపార ఖనిజసంపదను తన గర్భంలో నింపుకుని ప్రభవిల్లే రత్నగర్భ భరతభూమి. ఇవన్నీ ఒక ఎత్తైతే ఈ పవిత్ర భూమి యందుద్భవించిన మానవజాతి విశిష్టత చెప్పనలవిగాదు. భూగర్భ, ఖగోళ శాస్త్రములు, భౌతిక, రసాయనిక శాస్త్రములు, జీవ, జంతు, వృక్ష శాస్త్రములు మొదలైన అనేకానేక శాస్త్రములందు ఆరితేరిన శాస్త్రజ్ఞులు – వైద్య విజ్ఞానానికి మూలపురుషుడైన ధన్వంతరి నుంచి సిద్ధ నాగార్జునుడు మొదలైన ఎందరో ఎన్నో రకాల వైద్యములను, ఔషధులను కనిపెట్టిన భిషగ్వరులు – మంత్ర, తంత్రములను తెలిపిన మహాయోగులు, మంత్రోచ్చారణతోను, మాట

మాత్రం చేతనూ ఏదైనా చేయగల మహాతపస్వులు, మహర్షులు – విశ్వసృష్టిక్రమము, దాని పుట్టుక, సకల గ్రహగోళముల పుట్టుక, అవి సంచరించు విధానము, సృష్టి యొక్క ఆది, అంతములు, అవి ఎప్పుడు ఏ విధంగా ఉద్భవించి, ఎంతకాలము వసించి, ఎప్పుడు లయిస్తాయో తెలిపే కాలనిర్ణయము మొదలైన విషయముల గూర్చిన సరియైన అవగాహన కలిగిన భూత, భవిష్యద్రష్టలైన శాస్త్రజ్ఞులు – ఏయే లోకాలు ఎక్కడెక్కడ వున్నాయో, వాటి కధిపతులెవరో, అవి ఎలా వుంటాయో వాటి లక్షణాలేమిటో తెలుసుకున్న తత్వవేత్తలు – యిక్కడే ఉద్భవించారు.

అంతేగాక ఈ సృష్టి యొక్క తత్త్వమును గూర్చి – ఈ సృష్టి ప్రణవ స్వరూపమని, సంగీతమయమని, శబ్దస్వరూపమని, నాట్యమయమని, లయ, తాళ బద్ధమని అనుభవపూర్వకంగా నిరూపించిన శాస్త్రజ్ఞులు, వివిధ కళల పుట్టుక నెరిగి, వాటి అర్థాన్ని, ప్రయోజనాన్ని పరిశోధించి వాటి యందు ఆరితేరిన కళాకోవిదులు జన్మించినదిక్కడే.

సృష్టిలోని ప్రతి చిన్న విషయం దగ్గరనుంచి పెద్ద దాని వరకూ ఇక్కడివారు స్పృశించని భాగంలేదు, వారికి తెలియని విషయం లేదు. అంతేగాక ఈ సృష్టియొక్క రహస్యాన్ని తరచి తరచి ఆలోచించి, ధ్యానించి అనుభవపూర్వకంగా తెలుసుకున్న వేదవిదులు, తత్త్వవేత్తలు ఈ సృష్టిలో జన్మించిన ప్రతి ప్రాణీ – చేతనములే గాక జడములతో సహా – ఏ కారణంగా సృష్టింపబడ్డాయో, వాటి జన్మ రహస్య మేమిటో, కర్మలను ఏ విధంగా మలచుకుంటే సుఖశాంతులతో జీవించవచ్చో, ఏవిధమైన కర్మలు చేస్తే ఎటువంటి ఫలితాలు కలుగుతాయో తెలియజెప్పారు.

జన్మించిన ప్రతి జీవి తాను చేసిన కర్మల ఫలితంగా తిరిగి తిరిగి జన్మల నెత్తవలసి వుంటుందని జన్మ నెత్తిన ప్రతిసారి కష్టసుఖాలను తప్పక అనుభవించవలసి వుంటుందనీ కనుక ఈ జన్మ పరంపరల నుండి బయటపడే మార్గాన్ని అనుసరింపక తప్పదనీ గూడ తత్త్వవేత్తలు సూచించారు. అందుకని ఈ సృష్టికి మూలమైన దానిని చేరుకోడానికి అంటే జన్మ పరంపరలనుండి విముక్తి చెందడానికి చేయవలసిన అనేక యోగ సాధనలను వారు ప్రవచించారు.

ఈ సృష్టిలోని జీవులు ధర్మభ్రష్టులై అశాంతితో అలమటించి పోతున్నప్పుడు ఆయాదేశ కాల పరిస్థితులననుసరించి అవతార పురుషులు అవతరించి మళ్ళీ ప్రజలను ధర్మమార్గాన నడిపించి శాంతిని నెలకొల్పుతూ వస్తున్నారు. వీరే గాక, అట్టి శాంతిని పొందడం వల్ల కలిగే లాభమేమిటో తెలియజెప్పి, ప్రజలను సన్మార్గవర్తనులుగ జేసి సుఖశాంతులను పొందే యత్నం చేయడానికి వారిని అందుకు ఉన్ముఖులను చేసేటందుకు అనేకమంది మహాత్ములు ఎల్లప్పుడూ ఈ భరత భూమిపై వుంటూనే వున్నారు.

ఏ కోణంలో నుంచి చూసినా ఇంతటి ఉన్నతమైన, అద్భుతమైన, విశిష్టమైన భూమి ఎక్కడా కన్పించదు. ఇంతటి విశిష్టత కలిగిన ఈ భరతభూమిపై మనం జన్మించడం నిజంగా ఎంతటి అదృష్టం! అయితే ఇంతటి అదృష్టం కలిగిన మనం ఈనాడు ఎలా జీవిస్తున్నాము? ఈ విశిష్టతను అర్థం చేసుకుని మనకు జన్మనిచ్చిన ఈ భరత మాత పట్ల ప్రేమ, భక్తి, వినమ్రతతో, మెలగుతున్నామా? అన్నది ఆలోచించాల్సిన విషయం.

సహనానికీ, త్యాగానికి ప్రతీకగా ఈ భూదేవిని చెబుతారు పెద్దలు. తనను పూజించినవారినీ, దున్నిన వారినీ, తన్నిన వారిని గూడ ఏమీ అనక మౌనంగా భరిస్తుంది. ఈ భూమాత. నిలబడడానికి ఆధారమైన ఈ భూమాతను నిలువుగా చీల్చడానికి ప్రయత్నిస్తాము. ఆమె నుండి అవసరమైన వాటినే గాక, అనవసరమైన వాటిని గూడ పిండుకోజూస్తాము. ఆమెపై మల మూత్ర విసర్జనలు గూడ చేస్తాము. చిట్ట చివరకు ఆమె ఒడిలోనే శాశ్వత నిద్ర పొంది ఆమెలోనే కలిసిపోతాము. ఇది ఎప్పుడైనా మనం ఆలోచిస్తామా? – అంటే లేదనే చెప్పవచ్చు.

అందుకని ఆమె యొక్క గొప్పతనాన్ని గుర్తిస్తూ ఆమె ప్రసవించిన అద్భుత సృష్టిని అర్థం చేసుకుంటూ ఆమె పట్ల భక్తి గౌరవాలతో, కృతజ్ఞతతో మెలగడం మన ప్రధాన కర్తవ్యం.

అయితే ఈ కర్తవ్యాన్ని మనకు బోధించగలవారెవరు? పైన చెప్పుకున్నట్లు ఎలా మనం మన భావనలను అనుక్షణమూ నిలుపుకోవాలో, దాని వలన మనం ఎలా సుఖశాంతులతో జీవించగలుగుతామో చెప్పి, మనకు సరియైన మార్గాన్ని చూపించడమేగాక, ఆ మార్గాన నడిపించగల మహనీయులు ఎందరో వున్నారు. అలా నడిపించగల మహాత్ములను దర్శించి, సేవించి వారి నుండి జీవించడమెలాగో నేర్చుకోవాలి.

మన అదృష్టం కొద్దీ మనకు సరియైన మార్గం తెలిపి అన్ని విధాలా మనలను ఉద్ధరించగల పూజ్యశ్రీ మాస్టరుగారు లభించారు. ఆయన సమర్థ సాయినాథుని సేవించి వారిననుసరించి జీవించి తరించిన మహాత్ములు. మన జీవన విధానం గూర్చి పూజ్యశ్రీ మాస్టరుగారు ఎన్నో విషయాలు చెప్పారు. అలాగే మనం ఇంతకు ముందు చెప్పుకున్నట్లు ఈ భారతదేశం గురించి గూడ ఎంతగానో చెప్పడం జరిగింది.

ఈ భరత భూమిలోని అపార సంపదను, అద్భుత జ్ఞాన సంపదను చూసి ఆశ్చర్య చకితులైన ఆంగ్లేయులు దానిని తాము ఎలాగైనా పొందాలనే ఆకాంక్షతో, కుతంత్రాలతో ఈ పవిత్రభూమిని రెండు వందల సంవత్సరాలపాటు పాలించి మన సంపదను కొల్లగొట్టుకుపోవడమే గాక, మన సంస్కృతిని గూడ ఛిన్నాభిన్నం చేసారు. మన దేశ మహోన్నత చరిత్రను తిరగరాయించారు. మన అలవాట్లను పూర్తిగా మార్చివేశారు. అన్ని విధాలా మనలను భ్రష్టు పట్టించారు.

అయితే మన సంస్కృతి ఎన్ని విధాల భ్రష్టు పట్టినప్పటికీ దానిని సరిగా నిలబెట్టడానికి మహాత్ములు ఈ గడ్డపై అవతరిస్తూనే వున్నారు. సాధ్యమైనంతవరకూ నిలబెట్టడానికి ప్రయత్నిస్తూనే వున్నారు. అందుకే ఇప్పటికీ విదేశీయులు మన సంస్కృతికీ, ఆధ్యాత్మికతకూ బహ్మరథం పడుతూ, దానిని ఆచరించడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ మన దురదృష్టం కాబోలు మనం వారి కుసంస్కృతిని నేటికీ, అంటే మనలను వారు విడిచిపెట్టి వెళ్ళిన ఇన్ని సంవత్సరాల తర్వాత గూడ అనుసరిస్తూనే వున్నాము.

ఆంగ్లేయుల పాలనలో మనం మన సంస్కృతిని పూర్తిగా విస్మరించాము. 'పొరుగింటి పుల్లకూర రుచి' అన్నట్లుంది మన పరిస్థితి. దేశభక్తిపరంగా చూసినా మన దేశ స్వాతంత్రం కోసం పాణాలర్పించిన వారిని సైతం మనం విస్మరించాము. ఇతర దేశాలలో స్మరణీయదినాలను పెట్టుకుని ఇటువంటి వారిని స్మరించుకుంటారు.

కానీ మనమూ! కనీసం స్వతంత్ర దినోత్సవము, గణతంత్ర దినోత్సవములలోనైనా అట్టి త్యాగధనులను స్మరించుకుంటున్నామా! అన్నది సందేహమే. కేవలం జెండాలు మాత్రం ఎగరేసి తృప్తి పడుతున్నాము.

ఉదాహరణకు విదేశాలకు వెళ్ళిన మనవాళ్ళ పిల్లలకు చాలామందికి మాతృభాష రాదు. ఆంగ్లభాష మాత్రమే వచ్చు. కారణం మనం ఇంట్లో గూడ మన మాతృభాషను మాట్లాడుకోము గనుక. ఇతర దేశాల వరకూ ఎందుకు? ఇతర రాష్ట్రాలకు వెళ్ళిన చాలామంది పిల్లలకు తెలుగు మాట్లాడడం గూడ రాదు. అంటే మనలో కొందరము ఇంట్లో 'తెలుగు' అన్న పదాన్ని ఆంగ్లంలో గూడ రానివ్వమన్నమాట. కారణం తెలుగు అన్నది తెలిస్తే మన పిల్లలు తెలుగు ఎక్కడ నేర్చుకుంటారోననే భయం. అంటే మన భావం ఏమిటన్నమాట? మన తల్లిని మనం కించపరచుకుంటున్నామన్న మాట. మాతృభాషనే గౌరవించని మనం మాతృదేశాన్ని గౌరవించగలమా? గౌరవించడమనేది అలవాటు చేయకపోతే మన పిల్లలు మనలను ఎలా గౌరవిస్తారు? అందుకనే ఈ రోజులలో చాలా మంది పిల్లలు "తల్లిదండ్రులను ఎందుకు గౌరవించాలి?" అని అడుగుతున్నారు. "మీరేమన్నా మమ్మల్ని కావాలని కన్నారా? మేమే పుట్టాము. మీకు – కాకపోతే మరొకచోట పుట్టి వుండేవాళ్ళమేమో!" అంటున్నారు. అలాగే "ఈ దేశంలో కాకపోతే మరొక దేశంలో పుడతాము. ఇందులో గౌరవించడానికి ఏమున్నది? ఇంకా యిక్కడైతే కట్టుబాట్ల కబంధహస్తాలలో ఇరుక్కుంటాము. ఇతర దేశాలలో అవి లేవు కనుక స్వేచ్ఛగా వుండవచ్చు" అంటున్నారు. అలా అని అన్ని విషయాలలోనూ వాళ్ళను అనుసరిస్తామా అంటే అదీ కన్పించడం లేదు. వాళ్ళు మన దేశంలో అన్ని వందల సంవత్సరాలు వున్నప్పటికీ వాళ్ళ వేషభాషలు మార్చుకున్నారా? వాళ్ళ భాషనే వాళ్ళు మాట్లాడారు గదా!

వాళ్ళ వేషమే వాళ్ళు వేసుకున్నారు గదా!

కానీ మనదేశంలో వుండే మనము ఇప్పటికీ వాళ్ళ వేషభాషలనే అనుసరిస్తున్నాము. వాళ్ళ సాంప్రదాయాలను వాళ్ళు వదులుకోనప్పుడు మన సాంపదాయాన్ని మనమూ వదులుకోగూడదదన్న విషయాన్ని మాత్రం మనం వాళ్ళ నుండి నేర్చుకోవడం లేదు.

ఇట్టి దుస్థితి గూర్చి పూజ్యశ్రీ మాస్టరుగారు ఎంతగానో ఆవేదన చెందేవారు. ఈ పరిస్థితి బాగుపరచాలని ఆయన ఎంతగానో ఆలోచించి దీనికి పరిష్కార మార్గం ధర్మప్రబోధమేనని తలచారు. ధర్మబుద్ధిని విస్మరించిన తెల్లవారి నిరంకుశ పాలనను నిర్మూలించడానికి తన జీవితాన్నే ధారపోసిన గాంధీ మహాత్ముడినే గాక, అందుకై పోరాడిన కిందటి తరం వారిని విస్మరించారు. ఆనాడు ఎన్నో కోట్ల మంది తమ జీవితాలను స్వరాజ్య పోరాటానికి అంకితం చేసి కుటుంబాలను, పదవులను, సంపదలను త్యాగం చేసి చెరసాళ్ళలో మగ్గి అష్టకష్టాలు పడ్డారు. ఎంతోమంది ఆ పోరాటంలో మరణించారు గూడ. కానీ నేడు మనలో చాలామందికి అట్టి త్యాగమూర్తుల గూర్చిగాని, ఆ ఉద్యమానికి మూలపురుషుడైన గాంధీ మహాత్ముని గూర్చిగానీ తెలియకపోవడమే చిత్రం. దీనికి మూలకారణం ధర్మాన్ని విస్మరించడమే కారణమని పూజ్యశ్రీ మాస్టరుగారు భావించారు. అందుకనే ఆనాడు ఐకమత్యంతో పోరాడి తెల్లవారిని మన దేశం నుంచి వెళ్ళగొట్టినప్పటికీ నేటి ప్రజలు ఐకమత్యం లేక అనేక భేదభావాలతో, తగవులు కొనితెచ్చుకుంటున్నారు. నేడు ఎక్కడ చూసినా విభేదాలే, తగువులాటలే!

అందుకనే పూజ్యశ్రీ మాస్టరుగారు ధర్మప్రబోధాన్ని ప్రథమ కర్తవ్యంగా భావించారు. అయితే నేడు ధర్మం గూర్చి చెబితే వినేవారెవరు? కనుక అట్టి ధర్మబద్ధ జీవనం గడిపే మహాత్ముల పట్ల భక్తిభావం కలిగితే ఆ మహాత్ములు చెప్పేది నెమ్మదిగా ప్రజల మనసులలోకి ఎక్కుతుందని, క్రమంగా వారు ధర్మబద్ధ జీవితాన్ని గడపగలరనీ ఆయన భావించారు. కనుక మహాత్ముల సేవనం ముఖ్యమని ఆయన తలచారు. వారిలో గూడ కోహినూర్ వజ్రం వంటి వారయిన శిరిడీ సాయినాథుని సేవించడం అత్యంత ప్రధానమని ఆయన తలచారు.

ఆయన శిరిడీ సాయినాథుని గూర్చి ప్రచారం చేసినప్పటికీ అప్పుడప్పుడు ఆయన భారతీయ సంస్కృతి గురించి, దాని వైభవం గురించి, ఈ దేశ చరిత్ర గురించి చెబుతూ వుండేవారు. ప్రస్తుత పరిస్థితిలో మన సంస్కృతిని కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా వుందని ఆయన బోధించేవారు. ఆయన రచించిన 'శ్రీ సాయి సన్నిధి' లో గూడ శ్రీ శిరిడీ సాయిబాబా స్వతంత్రోద్యమంలో సూత్రధారియై పావులు ఎలా కదిపారో స్పష్టంగా వ్రాశారు గూడ.

భౌతిక శాస్త్ర విజ్ఞానము, ఆధ్యాత్మిక జ్ఞానము రెండూ ఇక్కడ సంపూర్ణంగా వున్నాయని, లౌకిక జీవితం ద్వారా ఆధ్యాత్మికతను సాధించగల విశిష్ట జీవన విధానం ఇక్కడ వున్నదని ఆయన చెప్పేవారు. సర్వ సమైక్యతే భారతీయ తత్త్వమని, వివిధ జాతులను, మతాలను, కులాలను సమానంగా చూడడము, అందరితో కలిసి జీవించడమేనని ఆయన చెప్పేవారు. కనుక దేశకాల పరిస్థితుల ననుసరించి వివిధ మతాలు ఏర్పడినప్పటికీ ఆ మతాలకు మూల పురుషులు చెప్పిన సత్యమొక్కటేననీ కనుక మానవులందరూ కలిసి జీవించగలగడమే సరియైన జీవిత విధానమనీ ఆయన బోధించేవారు.

ఆయన సత్సంకల్పానికి మెచ్చి కాబోలు ఒక రోజు బాబా పూజ్యశ్రీ మాస్టరుగారికి స్వప్నం ద్వారా స్వాతంత్య పోరాటం గూర్చి, సమైక్య జీవన విధానాన్ని గూర్చి గ్రంథాలు రచించమని సందేశమిచ్చారు. అది బాబా యొక్క ఆజ్ఞగా భావించి పూజ్యశ్రీ మాస్టరుగారు అట్టి రచనకు పూనుకున్నారు.

అందుకని మనం ఆయన చెప్పినట్లు సర్వమానవ సమైక్యత కోసం ప్రయత్నిస్తూ, ఆయన చెప్పిన మార్గంలో నడుస్తూ ఆయన మరల అవతరించాలనీ, ఆయనే గాక ధర్మస్థాపన చేసే మహాత్ములు అవతరిస్తూనే వుండాలనీ మనసారా ప్రార్థిద్దాము. పూజ్యశ్రీ మాస్టరుగారు యిలా చెప్పేవారు: "జన్మనిచ్చిన తల్లియొక్క, జన్మభూమి యొక్క ఋణాన్ని మనం ఏనాటికీ తీర్చుకోలేము. అందుకని మనలను సర్వకాల సర్వావస్థలయందు

భరించే జన్మభూమికి మనము అనుక్షణమూ కృతజ్ఞులమై వుండాలి. ఆమెను జాగత్తగా కాపాడుకుంటూ వుండడం మన కనీస కర్తవ్యం. అందువలన మనమే సుఖంగా జీవించగలుగుతాము. అలాగాక రక్తపాతం చేసుకుంటే తాను యింతటి భ్రష్టులను కన్నానా?" అని ఆమె కంపిస్తుంది. ప్రకృతి విలయతాండవం చేస్తుంది. పర్యవసానం అనుభవించక తప్పదు" అని.

అందుకని మనం పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పినట్లు ఈ దేశము, ఈ జాతి ఎంత ఉన్నతమైనదో గుర్తుపెట్టుకోవాలి. ఇక్కడ జన్మించినందుకు మనమెంతటి అదృష్టవంతులమో తెలుసుకోవాలి. మనకు జన్మనిచ్చినందుకు జననియైన జన్మభూమికి అనుక్షణము కృతజ్ఞతలు తెలుపుకోవాలి.

అందుకే అన్నారు పెద్దలు : "జననీ జన్మభూమిశ్చ, స్వర్గాదపి గరీయసీ", అని "జన్మనిచ్చిన తల్లి, జన్మభూమి స్వర్గానికంటె గొప్పవి!"

ఈ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా మన భారతమాత విముక్తి కోసం ఎంతగానో కృషి చేసిన, అసువులు బాసిన త్యాగమూర్తులకు మరొక్కసారి కృతజ్ఞతా పూర్వక వందనాలను సమర్పిద్దాం. పూజ్యశ్రీ మాస్టరుగారి డెబ్బది అయిదవ జన్మదిన సందర్భంగా సంకల్పించిన 'కృతజ్ఞతామహోత్సవ' సందర్భంగా మనము మన దేశ, జాతి, సంస్కృతి కోసం సమైక్యంగా ధర్మ ప్రవర్తనను అలవరచుకుందాం. సాటి వారికి ధర్మాన్ని ప్రభోధించడానికి దీక్ష పూనుదాం.

ఈ సందర్భంలో దేశభక్తుడు శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారు రచించిన ఈ దేశభక్తి గీతాన్ని ఒక్కసారి స్మరించుకుందాం.

ఏ దేశమేగినా ఎందు కాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలపరా నీ జాతి నిండు గౌరవము

ఏ పూర్వ పుణ్యమో, ఏ యోగ బలమో
జనియించినాడ వీ స్వర్గఖండమున
ఏ మంచిపూవులన్ ప్రేమించినావో
నిను మోసె ఈ తల్లి కనక గర్భమున

లేదురా ఇటువంటి భూదేవి యెందూ
లేరురా మనవంటి పౌరులింకెందు.
సూర్యునీ వెలుతురుల్ సోకునందాక
ఓడల జండాలు ఆడునందాక

అందాక గల ఈ అనంత భూతలిని
మన భూమి వంటి చల్లని తల్లి లేదు
పాడరా నీ తెల్గు బాలగీతములు
పాడరా నీ వీర భావ భారతము

తమ తపస్సులు ఋషుల్ ధారవోయంగా
శౌర్య హారముల్ రాజచంద్రులర్పింప
భావ సూత్రము కవి ప్రభువులల్లంగ
రాగ దుగ్ధముల్ భక్తరత్నముల్ పిదుక

దిక్కులకెగదన్ను తేజమ్ము వెలగ
రాళ్ళ తేనియలూరు రాగాలు సాగ
జగములనూగించు మగతనంబెగయ
సౌందర్యమెగ బోయు సాహిత్యమలర

వెలిగినదీ దివ్య విశ్వంబుపుత్ర
దీవించె నీ దివ్య దేశంబు పుత్ర
పొలములా రత్నాలు మొలిచెరా ఇచట
వార్ధిలో ముత్యాలు పండెరా ఇచట

పృథివి దివ్యౌషధుల్ పిదికెరా మనకు
కానలా కస్తూరి కాచెరా మనకు
అవమానమేలరా? అనుమానమేలరా?
భారతీయుడనంచు భక్తితో పాడ!!

# వార్తాలాపము

( గత సంచిక తరువాయి)

శ్రీమతి అడిదం వేదవతి

శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.

## 16వ ప్రసంగము

### ప్రమాదః

చేయవలసిన పనిని చేయవలసిన సమయానికి చేయకపోవడాన్ని ప్రమాదము అంటారు. శంకరాచార్యులవారు ఇలా అన్నారు:

శ్లో॥ న ప్రమాదాదనర్థోఽన్యో
జ్ఞానినః స్వస్వరూపతః।
తతో మోహః తతోఽహంధీః
తతో బంధః తతో వ్యథా॥

భావం: జ్ఞానికి పొరపాటు కంటే ఎక్కువ కీడు మరొకటి లేదు. పొరబాటు వలన జ్ఞానికి మోహము కలుగుతుంది. మోహము వలన అహంభావము కలుగుతుంది. అహంభావము చేత బంధంలో చిక్కుకుంటాడు. అప్పుడు దుఃఖం కలుగుతుంది.

'జ్ఞాని' అనే పదాన్ని ఇక్కడ దృఢము కాని అపరోక్షజ్ఞానము కలవాడు అనే అర్థంలో ఉపయోగించబడింది.

ఇప్పుడు ఎంతోమంది వేదాంతశాస్త్రాన్ని అధ్యయనం చేస్తున్నారు. మననము ద్వారా 'నేను స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలకు భిన్నమైన కూటస్థుడినైన ఆత్మను!' అని కూడా భావిస్తారు. కానీ సాంసారిక కార్యాలలో ప్రవృత్తి, సోమరితనము వున్న శరీరంలో అపరోక్షజ్ఞానానికి కావలసిన నిధిధ్యాసనము జరుగదు. ఈ విధంగా నిధిధ్యాసనంలో ప్రమాదము చేత అంటే అజాగ్రత్త వలన స్వస్వరూప సాక్షాత్కారము కలుగదు. శరీరము, ఇంద్రియాలలో అహంబుద్ధి పెరిగిపోతుంది. అహంబుద్ధి భోగవిలాసాల విషయంలో పెరిగినకొద్దీ అసుర స్వభావమును పొందుతుంది. ఇక జననమరణ రూపమైన సంసారసుఖాలు కలుగుతాయి.

మహాభారతంలో సనత్సుజాత ప్రకరణంలో ఇలా వున్నది:

**శ్లో॥ ప్రమాదో మృత్యురేవాహ**
**భగవాన్ బాదరాయణః ।**
**తస్మాత్ తద్ధ్వంసనే దక్షో యః**
**స మృత్యుంజయో భవేత్॥**

భావం: వ్యాసభగవానుడు 'ప్రమాదము' అంటే 'మృత్యువు' అని చెప్పాడు. కాబట్టి ప్రమాదాన్ని జయించినవాడు అంటే జాగరూకతతో (అప్రమత్తతతో) జీవితము గడిపేవాడు మృత్యువును జయిస్తాడు.

పరమశివుడు కూడా మొదట మృత్యువుకు అధీనుడేనట! గంగాతీరంలో ఏకాంతంగా కూర్చుని యోగాభ్యాసము చేయడంవలన ఆయన మృత్యువును జయించి మృత్యుంజయుడని పేరుపొందాడు. అలాగే మీరు కూడా ప్రమాదమును జయించి, ఏకాంతంగా కూర్చుని యోగాభ్యాసం చేస్తే మృత్యువును జయించగలరు. మృత్యుంజయులని పేరుపొందుతారు.

ఇంతవరకు తమో గుణలక్షణాలు వివరించబడ్డాయి. ఈ సమయంలో జయంతీభాయి ప్రశ్నించాడు:

"వృత్తిని సాత్త్విక ప్రధానముగా చేయడానికి సాధనమేమిటి?"

స్వా॥ ప్ర॥ : ఈ విషయంలో భాగవతము ఇలా చెపుతుంది.

**శ్లో॥ శ్రుత్యా సత్త్వపురాణానాం**
**సేవయా సత్త్వవస్తునః।**
**అనువృత్త్యా చ సాధూనాం**
**సత్త్వవృత్తిః ప్రజాయతే॥**

భావం: సాత్త్వికధర్మాన్ని బోధించే గ్రంథాలను శ్రవణం చేయడంవల్ల, సాత్త్విక పదార్థాలను సేవించడం చేత, సత్సంగము చేత సత్త్వవృత్తి ఉదయిస్తుంది.

శృత్యా సత్త్వపురాణానాం: సాత్త్వికము మొ॥న గ్రంథాల గురించి దేవీభాగవతంలో వివరించబడింది.

**శ్లో॥ సాత్త్వికం వేదశాస్త్రాది**
**సాహిత్యం చైవ రాజసమ్।**
**తామసం యుద్ధవార్తాచ**
**పర దోష ప్రకాశనమ్॥**

భావం: వేదశాస్త్రాలు మొ॥న వాటిని శ్రవణం చేయడం సాత్త్వికము. సాహిత్యాన్ని వినడం రాజసం. యుద్ధవార్తలను, ఇతరుల దోషాలను వినడం తామసము.

నాలుగు వేదాలు, ఉపనిషత్తులు భగవద్గీత మొ॥వి శ్రవణం చేయడం సాత్త్వికశ్రవణము. కావ్యాలు, నాటకాలు, నవలలు మొ॥న శృంగార ప్రధానమైన గ్రంథాలు రాజసమైనవి. యుద్ధాలను వర్ణించేవి, ఇతరుల దోషాలను ప్రకటించేవి అయిన గ్రంథాలు తామసికమైనవి.

రామాయణ మహాభారతాలలోని యుద్ధభాగాలను విడిచిపెట్టి నీతి భాగాలను చదవాలి. రామచంద్రుడు కైకేయి అడిగిన వరాలను అనుసరించే తండ్రి ఆజ్ఞను పాలించడానికి రాజ్యాన్ని వదిలి వనవాసము చేసిన నీతి ప్రస్తావనను రామాయణం నుంచి చదవాలి. శాంతిపర్వము మొ॥న వాటిలో భీష్మ పితామహుడు ధర్మరాజుకు రాజనీతిని ఉపదేశించిన ప్రసంగాలను మహాభారతంలో చదివి, యుద్ధభాగాన్ని విడవండి.

సేవయా సత్త్వ వస్తునః :- సాత్త్విక పదార్థాన్ని సేవించడం, అన్నపానాలు, వస్త్రాలంకరణలు, నివసించే భవనము మొ॥వి శరీరాన్ని పోషించడానికి, రక్షించడానికి అవసరమైనంతవరకు మాత్రమే ఉపయోగించుకోవాలి.

అనువృత్త్యా చ సాధూనామ్:- సత్పురుషుల దగ్గరకు వెళ్ళి సన్మార్గాన్ని గ్రహించాలి.

శ్రీమద్భాగవతంలో సత్పురుషుల లక్ష్మణాన్ని చెబుతూ కపిలుడు తన తల్లితో ఇలా అన్నాడు-

**శ్లో॥ తితిక్షవః కారుణికాః**
**సుహృదః సర్వదేహినామ్।**
**అజాతశత్రవః శాన్తాః**
**సాధవః సాధుభూషణాః॥**

**మయ్యనన్యేన భావేన**
**భక్తిం కుర్వన్తి యే దృఢామ్।**
**మత్కృతే త్యక్త కర్మాణః**
**త్యక్త స్వజన బాంధవాః॥**

**మదాశ్రయాః కథా ఇష్టాః**
**శృణ్వన్తి కథయన్తి చ।**
**తపన్తి త్రివిధాః తాపాః**
**నైతాన్మద్గత చేతసః॥**

**త ఏతే సాధనః సాధ్వి!**
**సర్వసంగ వివర్జితాః।**
**సంగః తేష్వథ తే ప్రార్థ్యః**
**సంగదోష హరా హి తే॥**

భావం: తల్లీ! ద్వంద్వాలను సహించినవారు, దయకలవారు, ప్రాణులపట్ల నిస్వార్థమైన ప్రేమకలవారు, శాంతులు, శత్రువులు లేనివారు, భగవంతునిపట్ల అనన్యభావంతో దృఢమైన భక్తి కలవారు, దేవుని కోసం అన్ని కర్మల యందు, తనవారియందు, బంధువులయందు మమకారాన్ని వదిలి వేసినవారు, ఎల్లప్పుడూ దేవుని కథలను కీర్తించువారు, శ్రవణము చేసేవారు, భగవంతుని ధ్యాసలో నిమగ్నులయ్యేవారు సాధువులు. వారు మూడు విధాలైన తాపాలవలన బాధ పొందరు. ఈ సాధువులకు ఏవిధమైన కోరికలు వుండవు. వారే కామ దోషాన్ని నశింపజేయగలరు, వారి సాంగత్యం చేయాలి.

ఇతర గ్రంథాలలో కూడా ఇలా వుంది:

**శ్లో యథా చిత్తం తథా వాచో**
**యథా వాచస్తథా క్రియా!**
**చిత్తే వాచి క్రియాయాం చ**
**సాధూనామేక రూపతా ॥**

భావం: మనస్సులో ఎలా వుంటే మాట అలాగే వుంటుంది. మాట ఎలా వుంటుందో క్రియ అలానే వుంటుంది. అంటే సత్పురుషుల మనస్సు, వాక్కు, కర్మ – ఈ మూడూ ఒకే రకంగా వుంటాయి.

ఈ దృష్టాంతం వినండి:

గోరా, కుంభారు, జ్ఞానోబా మొ॥న కొందరు భక్తులు ఒకప్పుడు పండరీపురంలో సమావేశమయ్యారు. భజనలు సాగుతూ వున్నాయి. అప్పుడు సాక్షాత్తూ విఠలుడే ప్రత్యక్షమై వారితో ఇలా అన్నాడు – "సోదరులారా, అందరూ నాకు నమస్కరిస్తున్నారు. కానీ ఈ రోజు నాకు కూడా ఎవరికో ఒకరికి సాష్టాంగ నమస్కారం చేయాలని వుంది. ఎవరికి నమస్కరించమంటారు? మీరే చెప్పండి!"

భక్తులిలా అన్నారు – "ఈ ప్రశ్నకు తుకారాంగారు తప్ప మరెవ్వరూ సమాధానమివ్వలేరు". అప్పుడు విఠలుడు తుకారాంను అడిగాడు.

తుకారాం ఇలా సమాధానమిచ్చాడు:

**'బోలే తస చాలే, త్యాచా వందోన పావులేం!'**

అంటే – 'మాట్లాడినట్లు ప్రవర్తించేవాడు వందనీయుడు' అని అర్థం.

విఠలుడిలా అన్నాడు – " అటువంటివారు మీరే! కాబట్టి మీకే నేను సాష్టాంగ నమస్కారం చేస్తున్నాను".

అంటే ఏమిటంటే మహాపురుషుల మనస్సు, వాక్కు, కర్మ ఒకేరకంగా వుంటుంది.

ఇటువంటి గుణాలు కల సాధువులు చేసే సదాచారాలను అనుసరించాలి. ఇలా చేసినట్లయితే సత్త్వగుణం వృద్ధి చెందుతుంది.

**- సశేషం**

(గత సంచిక తరువాయి)

# భగవాన్ శ్రీ భరద్వాజ

*శ్రీమతి శ్రీదేవి*

## అధ్యాయం - 7

**8. శ్రీఆనందమయి మాత :** వెనుకటి తూర్పు బెంగాల్‌లోని త్రిపురా జిల్లాలో విద్యాకూట్ అనే గ్రామంలో బిపిన్ బిహారి భట్టాచార్య, మోక్షదా దేవి అనే పుణ్యదంపతులకు ఏప్రిల్ 30, 1896న రెండవ కుమార్తె జన్మించింది. ఆమెకు నిర్మలాదేవి అని పేరు పెట్టుకొన్నారు. ఆమెయే ఆనందమయి మాతగా ప్రఖ్యాతి గాంచారు.

అది 1968వ సంవత్సరం. భరద్వాజ మాస్టరుగారు బాపట్ల కాలేజీలో ఆంగ్లోపాధ్యాయ పదవిని విడిచిపెట్టి జిల్లెళ్ళమూడి అమ్మ సన్నిధిలో వున్న రోజుల్లో నైమిశారణ్యంలో ఆనందమయి అమ్మ భాగవత సప్తాహం నిర్వహిస్తున్నారు అని తెలిసి, భరద్వాజగారు నైమిశారణ్యం చేరి అక్కడి ప్రధానమైన షామియానాలో ప్రవేశించేసరికి అక్కడే ఒక ప్రక్కగా ఒక మంచంమీద ఆనందమయి మాత కూర్చొని కొద్దిమంది భక్తులకు దర్శనమిస్తున్నారు. వెంటనే భరద్వాజగారు గూడ నమస్కరించుకొని ఆమె సన్నిధిలో కూర్చున్నారు. అమ్మ బెంగాలీ భాషలో ఏమేమో సన్నిహిత శిష్యులతో చెబుతూ మధ్య మధ్యలో పసిపిల్లలా, పండు వెన్నెలలా హాయిగా నవ్వుతున్నారు. సుమారు 70 సం॥లు వయస్సున్నట్లు కనిపిస్తున్నప్పటికీ నల్లని జుట్టు, తెల్లని శరీరచ్ఛాయ, అతి తెల్లని చీర కట్టుకొని కూర్చున్న అమ్మ వెన్నముద్దలా అనిపించారు. మధ్యలో ఆమె భరద్వాజగారి కేసి చూసి, “నీవెక్కడినుండివస్తున్నావు?”అనిఅడిగితెలుసుకున్నారు. తర్వాత “అంత దూరం నుండి వచ్చావా?” అన్నారు. శ్రీ మాస్టరుగారు, “అమ్మ దగ్గరికంటే దూరమేమిటి? ఒడిలోకి చేరగలగడమే ధన్యత” అన్నారు. అమ్మ నవ్వి, అవునన్నట్లు తలవూపారు. అటు తర్వాత సుమారు అరగంటసేపు గాఢమైన మౌనంలో ఆయనకేసి చూస్తూ కూర్చున్నారు. అపుడు చిత్రమైన అనుభూతిలో ఆయనకు తెలియకుండా కాలం క్షణాలలాగా గడిచిపోయింది.

రెండవ రోజున ప్రవచనం అయ్యాక, భరద్వాజగారికి ఎలాగైనా అమ్మను కొద్దిసేపైనా విడిగా చూడాలని ఆరాటం కలిగింది. ఆయన ఎక్కడనుండి కిటికీ గుండా అమ్మ బాగా కనిపిస్తారో చూచుకొని ఆ దిక్కున దూరంగా చెట్టు క్రింద కూర్చొని అమ్మను చూస్తున్నారు. కానీ చూచిన కొద్దీ తృప్తి లేదు. వెంటనే అమ్మ కిటికీలోంచి తదేకంగా ఆయనకేసి చూచి ఎవరితోనో ఏమో చెప్పారు. వారు మధ్యలో వున్న కంచె వద్దకు వచ్చి ఆయనతో అమ్మ పిలుస్తున్నారని చెప్పారు. అకస్మాత్తుగా జరుగుతున్న ఆ సాయిలీలకు శ్రీ భరద్వాజ మాస్టరుగారికి రోమాంచితమైంది. వెంటనే ఆయన అమ్మ గదిలోకి వెళ్ళి నమస్కరించుకొన్నారు.

“నీవెవరు? ఎక్కడి నుండి వచ్చావు?” అని మొదట బెంగాలీలోనూ, తర్వాత హిందీలోనూ అమ్మ అడిగి తెలుసుకున్నారు.

అమ్మ : “నీ విడిది ఎక్కడ? భోజనమెక్కడ



చేస్తున్నావు?" అని అడిగారు.

ఆయన : "గేటు బయట హోటల్లో. టీ – బిస్కట్లతో కడుపు నింపుకుంటున్నాను" అని చెప్పారు.

ఒక్కసారిగా అమ్మ ముఖం చిట్లించి అక్కడి వారిని పిలిచి, "ఈ బాబుకు మనతోపాటే ఆశ్రమంలో భోజనము, వుండడానికి గుడారము యిప్పించండి" అని కొంచెం కఠినమైన స్వరంతో హెచ్చరించారు. అంతవరకూ అమ్మ బెంగాలీలో మాట్లాడుతుంటే అక్కడున్న ఒక బ్రహ్మచారిణి అమ్మకు, భరద్వాజగారికి మధ్య అనువాదకురాలిగా సాయం చేసింది. అందువలన, తర్వాత ఒక వృద్ధ సన్యాసి శ్రీ మాస్టారిని విమర్శిస్తూ ఏదో గొణగటం వలన ఆయనకు అమ్మ సన్నిధిలో కొద్ది సేపుండే అవకాశం కలిగింది. సాయిలీల అమ్మ విషయాలలో గూడా అలా నిరూపణ గావడంతో ఆయనకు తనివి తీరిపోయింది.

మరురోజు బాబాను స్మరించి, "అమ్మ తమకై తామే నన్ను పిలిచి ప్రసాదమిచ్చి ఆశీర్వదించాలి" అనుకుంటూ కూర్చున్నారు ఆయన. కొద్ది నిముషాలలో అమ్మ ఆయనను పిలిపించారు. ఆయన వెళ్ళి నమస్కరించగానే ఆమె ప్రేమగా ఆయన కళ్ళలోకి చూస్తూ, ఆయన చేతిలో రవ్వకేసరి ప్రసాదం వేశారు. కళ్ళకద్దుకుని అమ్మకు సెలవు చెప్పుకొని వెనుకకు తిరగగానే, ఆమె హిందీలో "ఏమయ్యా! నీకు కావలసిందేమిటి?" అని మరుక్షణమే తమ మాట సర్దుకుంటూ "నీకేం కావాలి?" అన్నారు. భరద్వాజగారు వెనక్కు తిరిగి, "అమ్మా! మీ దర్శనం నాకు మరొక్కసారి కావాలి" అన్నారు. అమ్మ ఒక్క క్షణం ఆలోచనగా ఆయనకేసి చూసి, "మంచిది, అలాగే లభిస్తుందిలే ఫో!" అన్నారు. అప్పట్లో అమ్మ వయస్సు సుమారు 85 సం॥లు. ఆమె ఎక్కడా స్థిరంగా ఒక చోట వుండబోయేది లేదు. నిరుద్యోగిగా వున్న భరద్వాజగారు ఇంతదూరం వచ్చే అవకాశమూ లేదు. కనుక, 'ఆమె ఆశీర్వచనం ఎంత వరకూ ఫలిస్తుందో చూడాలి' అని అనుకున్నారాయన.

ఆ తర్వాత కొంతకాలానికి చిత్రమైన పరిస్థితులలో పూణే వెళ్ళారు – శ్రీ భరద్వాజగారు. అక్కడ శ్రీ గుళవణి మహరాజ్ గారు శ్రీ ఆనందమయి మాత పూణేలో వున్నారనీ, ఆమెను దర్శించమనీ చెప్పారు. భరద్వాజగారు ఆమెను దర్శించి, ఆమె సన్నిధిలో ఒక గంటసేపు ధ్యానం చేసుకొన్నారు. సరిగ్గా గంట అవగానే అమ్మ భరద్వాజగారి కేసి చూసి "తృప్తి అయిందా?" అన్నారు. ఆయనెంతో సంతోషంగా లేచి సాష్టాంగ నమస్కారం చేశారు. ఆమె నవ్వి ఆశీర్వదించారు. ఆ ముందటి రోజు ఆయన కొనుక్కున్న 'జ్ఞానేశ్వరి భగవద్గీత' (ఇంగ్లీషు) ఆమె ముందుంచగానే ఆమె దానిపై చేయి పెట్టి ఆశీర్వదించారు. భరద్వాజగారు సెలవు తీసుకొని వెనుకకు తిరగబోతుంటే, "అసలు నీకేమి కావాలి?" అన్నారు. అప్రయత్నంగా "మూడవసారి గూడా అమ్మ దర్శనం కావాలి" అన్నారాయన. ఆమె వారి ముఖం కేసి పరీక్షగా చూచి "అచ్ఛా, మిలీగా, జావ్" – మంచిది, (దర్శనం) లభిస్తుందిలే వెళ్ళు!" అన్నారు.

ఈసారి మాత్రం అమ్మ యిచ్చిన వరం

ఎలా నెరవేరుతుందో చూడాలని మరింత ఆసక్తిగా వున్నారు – శ్రీ మాస్టరుగారు. కొంతకాలం గడిచాక విద్యానగర్ కళాశాల గ్రంథాలయానికి గ్రంథాలు కొనుగోలు చేయడానికి మద్రాసు వెళ్ళారు. మద్రాసులో కల్కి గార్డెన్స్ అనే చోటికి శ్రీ ఆనందమయి అమ్మ వచ్చారని, అక్కడ భక్తులు ఆమెను దర్శించుకోవచ్చనీ తెలుసుకొని వెంటనే శ్రీ భరద్వాజగారు అక్కడకు వెళ్ళి ఆమెను దర్శించారు. అక్కడ జనవాహిని ఎంతో ఎక్కువగా వుంది. అందరితోపాటే వరుసలో వెళ్ళి ఆమెకు నమస్కరించుకొన్నారు. త్వరత్వరగా సాగి పోతున్న భక్తుల వరుసకేసి చూస్తూ, ఆమె వెంటనే ఆశీర్వదించి ఒక్కొక్కరినీ పంపి వేస్తున్నారు. శ్రీ భరద్వాజగారు నమస్కరించగానే ఆమె ఒక్కక్షణం తేరిపార పరిచయంగా ఆయన ముఖం కేసి చూచారు. క్లుప్తంగా "అమ్మా! మిమ్మల్ని మొదట నైమిశారణ్యంలో దర్శించుకొన్నాను. నేను కోరినట్లు పూణేలోను, మరల యిప్పుడు యిక్కడ గూడా మీ దర్శనం ప్రసాదించారు, ధన్యుణ్ణి" అన్నారు. ఆమె "అలాగా, బాగుంది!" అన్నట్లు భావం వచ్చేట్లుగా, అచ్చా....? అని వెంటనే, "అయితే ఇప్పుడేం కావాలి?" అన్నారు. "సంపూర్ణమైన మీ అనుగ్రహం వుంటే చాలు" అన్నారు. ఆమె నిండుగా నవ్వి, ఆశీర్వదించి ఆయన చేతిలో కలకండ వుంచారు. అదే శ్రీ మాస్టరుగారికి శ్రీ సాయి, శ్రీ అమ్మ ప్రసాదించిన ఆమె చివరి దర్శనం. తర్వాత అమ్మ పరమపదించారు. కాని ఆయన స్మృతిపథంలో ఆమె రూపము, మాట, సన్నిధి ప్రభావము స్థిరంగా నిలిచిపోయాయి. అవి సాయి కృపకు అతి ప్రశస్థమైన తార్కాణాలుగా ఆయన జీవితంలో నిలిచిపోయాయి.

ఇంకా ఎందరో మహనీయులు, అవధూతలు భరద్వాజగారిని గురించి, వారు మానవాళి శ్రేయస్సుకై చేస్తున్న కృషిని గురించి ఎంతగానో ప్రశంసించారు. వాటిలో కొన్నింటిని తెలుసుకొందాము

**శ్రీ రామిరెడ్డి తాత** – వీరు భరద్వాజగారింటికి విచ్చేసినపుడు మాస్టరుగారి ఫోటో వంక చూసి (అప్పటికి మాస్టరుగారు సమాధి చెందారు) "ఆయన దత్తాత్రేయుడు. ఈ ఇంట్లో స్థిరంగా వున్నాడు. జ్ఞానం తెలిసిన వాడు" అని అన్నారు.

**శ్రీ పూర్ణానంద స్వామి** – "సాయిబాబాను ఉచ్ఛ్వాస, నిశ్వాసాలలో నింపుకున్న సాయి భక్తుడు శ్రీ భరద్వాజ. ఆయన సంకల్పం విశ్వశక్తినే ప్రేరేపించి సఫలం కాగలదు" అన్నారు.

**శ్రీ విద్యోపాసకులు, బ్రహ్మవేత్తలు అయిన శ్రీ తాడేపల్లి రాఘవ నారాయణ శాస్త్రిగారు** – తమకు చేతులు జోడించి నమస్కరిస్తూ వున్న నిరహంకారులైన శ్రీ భరద్వాజ మాస్టరుగారిని చూసి నవ్వుతూ, "మీరు నా ఆశీస్సులు కోరుతున్నారా? శ్రీ గురుచరిత్ర వ్రాసిన మీకు ఆశీస్సులు అందించగలవారు ఎవరున్నారు?" అన్నారు.

**శ్రీ నాగమునీంద్ర స్వామి** – "ఆయన చల్లని కుండ. ఆయన చుట్టూ దొంగలు చేరారు. ఆయన దొంగలను బాగు చెయ్యాలంటాడయ్యా! ఎక్కడయినా దొంగలు బాగుపడతారటయ్యా?" అన్నారు.

**శ్రీ సుధీంద్ర బాబు** – "ధర్మము, పాపభీతి అడుగంటి పోయిన ఈ సమాజాన్ని ఆధ్యాత్మిక సంపదతో దైవభక్తితో నింపి పవిత్రమొనరించాలనే ప్రయత్నంలో ఆయన కాలానికి ఎదురీదుతున్నారు. అక్షరాలా ఆచార్య పదవికి ఆయన అర్హులు" అన్నారు.

**శ్రీ మాలిక్ బాబా** – శ్రీ మాస్టరుగారి గురించి "ఓ ఆంఖోం మే దేఖో. బాబా హై, సాయిబాబా హై" (ఆయన కన్నులను చూడండి! ఆ కన్నులలో సాయిబాబా నిండి వున్నారు) అని అన్నారు.

**అవధూత శ్రీ పోలయ్య తాత** – గుంటూరుజిల్లా వెంకటాపురం గ్రామంలో నివసించే యీ అవధూత స్వామి శ్రీ మాస్టరుగారి గురించి "ఆయనకు నేను టీ ఇవ్వాలి. ఆయన చాలా పెద్దవాడు" అన్నారు. 'మీ కంటే పెద్దవారా?' అని అడిగిన భక్తులతో, "అవునయ్యా! నాకంటే, అందరికంటే ఆయన పెద్దవాడు" అని పలికారు.

**- సశేషం**

# మాతృదేవి స్మృతులు

**శ్రీమతి సుభాషిణి, బాపట్ల**

పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి లీలా వైభవాన్ని, బాపట్లకు చెందిన శ్రీమతి సుభాషిణిగారు ఈ విధంగా తెలియజేస్తున్నారు.

ఒకసారి మా కుటుంబంలో కొన్ని సమస్యలు వస్తే, సత్సంగం నిర్వహించే కోటేశ్వరరావు అంకుల్ తో చెప్తే, పూజ్యశ్రీ అమ్మగారికి 2000 రూపాయలు దక్షిణ సమర్పించుకోమని చెప్పారు. అంత మొత్తాన్ని నేను ఒకేసారి సమర్పించలేనని నెలకి 200 రూపాయల చొప్పున సమర్పించుకుంటానని వారితో చెప్పాను. వారు సరేనన్నారు. అప్పట్లో మేము సత్సంగం చేసుకునే సమయంలో వచ్చిన దక్షిణ అంతా, నెలకి ఒకసారి పూజ్యశ్రీ అమ్మగారికి పంపించేవాళ్ళం. అందులో నా దక్షిణ 200 రూపాయలు కూడా కలిపి పంపించేవాళ్ళం. ఒకసారి పూజ్యశ్రీ అమ్మగారు ఒంగోలు వచ్చారని తెలిసి, నేను స్వయంగా దక్షిణ సమర్పించుకోవాలని, ఒంగోలు వెళ్ళి పూజ్యశ్రీ అమ్మగారికి రెండు వందల రూపాయలు దక్షిణ సమర్పిస్తే, దయతో స్వీకరించారు. ఆ తర్వాత నెల కూడా పూజ్యశ్రీ అమ్మగారు ఒంగోలులోనే వుండడంతో మళ్ళీ దర్శనానికి వెళ్ళి దక్షిణ సమర్పిస్తే, పూజ్యశ్రీ అమ్మగారు, బాబా గుడిలో హుండీలో వేయమన్నారు. నేను చాలా బాధపడ్డాను. నావల్ల ఏదో పొరపాటు జరిగి వుంటుంది. అందుకే దక్షిణ స్వీకరించలేదు అని బాధపడ్డాను. తరవాత ఆలోచిస్తే కిందటి నెలతో మేము మొక్కుకున్న 2000 రూపాయలు పూర్తయింది అని అర్థమయ్యింది. నా మనసులో ఎంత దక్షిణ ఇవ్వదలిచానో పూజ్యశ్రీ అమ్మగారికి తెలుసు, అలాగే సత్సంగంలో నేను కోటేశ్వరరావుగారికి చెప్పుకోవడం వారు నాకు పరిష్కారం చెప్పడం కూడా పూజ్యశ్రీ అమ్మగారికి తెలుసు. పూజ్యశ్రీ అమ్మగారు సర్వాంతర్యామి!!

మా అబ్బాయి చందుకి ఒకసారి టైఫాయిడ్ జ్వరం వచ్చి ప్లేట్లెట్స్ 30 వేలకు పడిపోయాయి. అప్పుడు శ్రీమతి వేదమ్మగారికి ఈ సమాచారాన్ని పూజ్యశ్రీ అమ్మగారికి అందజేయమని సందేశం పంపాము. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు శ్రీ సాయి లీలామృతం 11 సార్లు పారాయణం చేయమని, ఆరోగ్యం బాగున్నాక శిరిడి సాయినాథుని దర్శనానికి, ఒంగోలు పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనానికి వస్తామని మొక్కుకోమని చెప్పారట. చిత్రంగా ఆరోజు సాయంత్రం నుంచి ప్లేట్లెట్స్ పెరగడం ప్రారంభించాయి. త్వరలోనే కోల్కొని ప్రమాదం నుంచి బయటపడ్డాం. మా అబ్బాయికి ప్రాణభిక్ష పెట్టి కాపాడిన కరుణామయి మంగమ్మ తల్లి!!

పూజ్యశ్రీ అమ్మగారు సమాధి చెందడానికి కొన్ని నెలల ముందు నాకు ఒక స్వప్నం వచ్చింది. అందులో,,,,పూజ్యశ్రీ అమ్మగారు కొత్తగా కట్టుకున్న మా ఇంటికి విచ్చేశారు. నేను పూజ్యశ్రీ అమ్మగారికి ఎదురు వెళ్ళి లోపలికి రమ్మని ఆహ్వానించాను. అప్పుడు

పూజ్యశ్రీ అమ్మగారు నా చేయి పట్టుకుని నడుస్తూ లోపలికి వచ్చారు. "ఈ స్థలం చాలా బాగుందమ్మా" అన్నారు. నేను పూజ్యశ్రీ అమ్మగారిని ముందు గదిలో కూర్చోబెట్టాను. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారి చేతిలో ఒక సెల్ ఫోను వుంది. పూజ్యశ్రీ అమ్మగారు పదేపదే దానివైపే చూస్తున్నారు. నేను ఆశ్చర్యంగా, పూజ్యశ్రీ అమ్మగారివైపు, ఫోను వైపు చూస్తుండడంతో "ఏం లేదమ్మా, నాన్నగారు ఫోను చేస్తారమ్మా, వెళ్ళాలి" అని చెప్పారు. నాకేమీ అర్థం కాలేదు. బయట పిల్లలందరూ అటు ఇటు తిరుగుతూ ఆడుకుంటూ అల్లరి చేస్తుండడంతో, నేను పూజ్యశ్రీ అమ్మగారిని లోపలి గదిలోకి ఆహ్వానించాను. గదిలో మంచంవేసి దానిపై ఎరుపు రంగు కాటన్ చీరను పరిచాను. పూజ్యశ్రీ అమ్మగారు దాని మీద పడుకున్నారు.

కొంతసేపు అయ్యాక పూజ్యశ్రీ అమ్మగారు నన్ను బయటికి తీసుకెళ్ళమన్నారు. బయటకు తీసుకువచ్చాను. అక్కడి దృశ్యం మారిపోయింది. అక్కడ చాలా పెద్ద ఖాళీ ప్రదేశం కనిపించింది. ఒక పర్ణశాల వుంది. చాలా హడావిడిగా అక్కడ ఆడవాళ్లు మగవాళ్ళు ఏవో పనులు చేస్తున్నారు. గుంతలు తవ్వుతున్నారు. రాటలు నాటుతున్నారు. ఆడవాళ్ళందరూ వంటలు చేస్తున్నారు. అంతా కోలాహలంగా వుంది. వాళ్ళందరికీ పూజ్యశ్రీ అమ్మగారు ప్రసాదం ఇచ్చారు. 'ఈ హడావిడి ఏంటమ్మా?', అని నేను అడిగితే, 'నీకే తెలుస్తుందిలే' అని అన్నారు. స్వప్నం ముగిసింది. తర్వాత కొన్నిరోజులకే పూజ్యశ్రీ అమ్మగారు సమాధి చెందడం, జూన్ 4వ తేదీన అమ్మగారి సమాధి కార్యక్రమం చూస్తున్నప్పుడు, స్వప్నంలో నేను పూజ్యశ్రీ అమ్మగారికి మంచం మీద వేసిన చీర లాంటిదే పూజ్యశ్రీ అమ్మగారికి కప్పడం జరిగింది. నా స్వప్నంలో చాలా విశాలమైన ప్రదేశం చూపించారు కనుక, అది గుమ్మళంపాడు ప్రాంతమని, పైగా నాన్నగారు ఫోను చేస్తారు, నేను



వెళ్లాలి అన్నారంటే 'పూజ్యశ్రీ మాస్టరుగారి నుంచి పిలుపు వస్తుంది, నేను వెళ్ళిపోతాను' అని, ఇవన్నీ నాకు ముందుగానే స్వప్నంలో పూజ్యశ్రీ అమ్మగారు సూచనలు చేశారు. కానీ ఇలా జరుగుతుందని ఎవరూ ఊహించము కదా!

ఒక శరీరానికి మాత్రమే పరిమితమైన జగన్మాత ఇప్పుడు విశ్వవ్యాప్తమై మనందరినీ అదే మాతృతత్వంతో కనిపెట్టి కాపాడుతూ మన బాగోగులు చూసుకుంటూ ఎప్పటికీ మనతోనే వుంటారు అన్నది యదార్థం! అంతటి అమ్మగారు మనకు లభించడం మనందరి పూర్వజన్మ సుకృతం. ప్రతి జన్మలోను ఆ తల్లి అండదండలతోనే జీవితం గడిపే భాగ్యాన్ని ప్రసాదించమని మనస్ఫూర్తిగా వేడుకుంటున్నాను.

(జూన్ సంచిక తరువాయి)

# శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

**శ్రీమతి శ్రీదేవి**

కొందరు స్త్రీలు "అమ్మా! ఒక్కొక్కసారి మనసు నామస్మరణ మీద చక్కగా లగ్నం అవుతుంది. మరి కొన్నిసార్లు యెంత ప్రయత్నించినా మనసు యేకాగ్రమవక యెంతో చంచలంగా వుంటుంది. అలా యెందుకు జరుగుతుందమ్మా?" అని అడిగారు. 'అలా జరగటానికి కారణాలు అనేకం. మీ ఆహార విహారాలలోని తేడాల వలన మనస్సు చంచల మవటం, నామస్మరణపై లగ్నం కాకపోవటం వంటి దోషాలు సంభవిస్తుంటాయి. మీరు ప్రతి రోజూ యెందరో వ్యక్తుల్ని కలుస్తుంటారు. వారితో మాట్లాడుతుంటారు. రకరకాల దృశ్యాలను చూస్తూవుంటారు. మీరు చూసే దృశ్యాలు, సన్నివేశాలు మీ మనస్సుని ప్రభావితం చేస్తాయి. మీరు మాట్లాడే వ్యక్తుల సంస్కారాల ప్రభావం మీ మనస్సుపై పడటం జరుగుతుంది. ఆ ప్రభావాలే మీ మనసుల్ని కలుషితం చేస్తాయి. సాధనలోని యేకాగ్రతకు భంగం కలిగిస్తాయి. మనస్సు రకరకాల విక్షేపాలకు లోనవుతుంది. అందువలన నేను చెప్పేదేమంటే, ఆధ్యాత్మిక మార్గంలో నడవాలనుకునేవారు ముందుగా యితర వ్యాపకాల నన్నింటినీ పక్కకు పెట్టి యేకాంతంలో గడపటం అవసరం. మోక్ష సాధన గమ్యంగా అనుకొన్నవారు ఆ మార్గానికి యే విధమైన ఆటంకాలు రాకుండా జాగ్రత్తలు వహించటం అవసరం. గృహస్థులకు తమకు వున్న బంధనాలను, వ్యాపకాలను తొలగించుకొనటం అంత తేలికయిన విషయం కాదు. అందువలన యెక్కువగా సత్సంగాలలో, సదాచారాలలో కాలం గడపటం అలవాటు చేసుకొనాలి. సత్పురుషుల దర్శనము, వారి జీవిత చరిత్రల పఠనము చేస్తుండాలి. వారి జీవిత చరిత్రల పఠన మనకు చిత్తశుద్ధిని కలుగజేస్తుంది. ఆ చిత్తశుద్ధి భగవంతుని వైపు అడుగులు పడేందుకు మనకు దోహదపడుతుంది. పూర్వజన్మ కర్మల ప్రభావం యీ జన్మపై తప్పనిసరిగా వుంటుంది. ఆ కర్మల ఫలితం సాధన పై కూడ ప్రభావం చూపుతుంది. సాధనలో పురోగతి కలగటం, పురోగతి కలుగకపోవటం కూడ కొంత వరకు కర్మల ఫలితమే కారణం. పూర్వజన్మ ప్రభావం వలననే మనసు వివిధ సందర్భాలలో వివిధరకాలుగా స్పందిస్తూ వుంటుంది. రకరకాలుగా భావావేశాలకు లోనవుతుంటుంది. వీటిని తొలగించుకొనే మార్గం యేమిటంటే రోజులో మనం చేసే కర్మలన్నీ భగవంతుని సేవలుగా భావించటమే! మన జీవితానుభవాలన్నీ భగవంతుని ప్రసాదాలుగా స్వీకరించటం వలన భావావేశాలు నియంత్రణలో వుంటాయి. అప్రమత్తతతో యెల్లప్పుడు యిటువంటి భావన నిలుపుకోవాలని ప్రయత్నిస్తున్నపుడు ఒక వృక్షంపై కొత్త చిగుళ్ళు చిగురిస్తున్న సమయంలో పండుటాకులు యేవిధంగానైతే రాలిపోతుంటాయో అదే విధంగా వైరాగ్యము, నిశ్చలభక్తి అనే శుభవాసనలు మనసులో ప్రవేశించి, సంసార వ్యామోహము, ఆశ, దుఃఖము అనే మనసులో అంతవరకు వున్న అశుభ సంస్కారాలు తొలగి పోవటం ప్రారంభమౌతుంది. మనస్సు అంతర్ముఖమై సాధనలో ముందుకు సాగుతుంది. అజ్ఞానంకూడ సాధన పురోగమనానికి మరొక విధంగా తోడ్పడుతుంది.

ఎండుటాకులు వృక్షపు పాదులో నేలపై రాలి, ఆ వృక్షానికే యెరువుగా మారి వుపయోగిపడినట్లే, సాధకుడి మనస్సు అంతర్ముఖమై సాధనలో ముందుకు సాగుతూ గతంలో తనలో వున్నట్టి అజ్ఞాన భావాలను స్మరించి, అవి గతంలో తన సాధనను యెంతగా నష్ట పరిచాయో గుర్తు తెచ్చుకుని, మరల అటువంటి అజ్ఞానంలో పడకుండా అప్రమత్తుడౌతాడు. కనుక అజ్ఞానం అనే విషయాన్ని కూడా ఒక పాఠంగా స్వీకరించి సాధనలో అప్రమత్తులు అవ్వాలి. ప్రపంచంలో అన్ని విషయాలూ విలువైనవే. త్రోసి వేయదగినది అంటూ యేదీ లేదు. వివేకంతో, విచక్షణతో ప్రతి చిన్న అంశము మనకు ఒక పాఠంగా మారి కర్తవ్య బోధ చేస్తున్నదన్న సత్యం గుర్తించటం యెంతో అవసరం" అన్నారు అమ్మ.

సిమ్లాలో వున్న రోజులలోనే ఒకనాటి మధ్యాహ్నం కొందరు స్త్రీలు శ్రీ ఆనందమయి మాత దర్శనార్థం వచ్చారు. వాళ్ళు తమ ఆధ్యాత్మిక సందేహాలను అమ్మ దగ్గర వ్యక్తపరచారు. ఒక మహిళ "అమ్మా యెంత ప్రయత్నించినా మనస్సు ధ్యానంలో స్థిరపడటం లేదు. మనసు నిలవాలంటే యేమి చేయాలి?" అని అడిగింది. అమ్మ నవ్వుతూ "ఒక కుండలో నిండుగా నీళ్ళను నింపి పెట్టాము. ఆ కుండను అటూ యిటూ ఊపుతూ వుంటే కుండలోని నీళ్ళు కదులుతూనే వుంటాయి. కుండను ఒక ప్రక్కన వుంచి దానిని కొంతసేపు కదిలించకుండా వుంచండి. కొంతసేపటికి నీళ్ళు నిశ్చలంగా వుండటం మనం చూస్తాము. అదే విధంగా శరీరాన్ని స్థిరంగా, కదలకుండా యెక్కువసేపు వుంచే కదలకుండా ప్రయత్నం చేయండి. లక్ష్యసాధన కోసం యేకాంతంలో కొంతసేపు యేదో ఒక చోట స్థిరంగా కూర్చుని ధ్యానం చేయండి. ఎంతసేపయితే మీరు స్థిరంగా ధ్యానంలో గడుపుతారో అంతసేపు మనస్సు యేకాగ్రత పొందటానికి యీ ప్రయత్నం దోహదపడుతుంది. కదలకుండా కూర్చోవటం వలన విక్షేపాలు తొలగి మనసు తన సహజ నిశ్చల శాంత స్థితిని పొందటంలో యెంతో పురోగతి సాధించటం మీరు చూస్తారు. మనస్సు యొక్క సహజస్థితి నిశ్చలానందమే. దానిని అందుకొనటానికి మనస్సు యెప్పుడూ సిద్ధంగా వుంటుంది. ఒక చోట స్థిరంగా కదలకుండా కూర్చుని ధ్యానం చేస్తుంటే మధ్యమధ్యలో మనస్సు అటూ యిటూ పరుగులు తీస్తుంటుంది. అయినా ప్రయత్నం మానకూడదు. నిరాశ చెందకూడదు. ఎటువంటి పరిస్థితులలోనైనా పట్టువిడువక ముందుకు సాగిపోతుండాలి. అలాచేస్తే మనస్సు తప్పకుండా ధ్యానంలో స్థిరపడుతుంది" అన్నారు.

హారణా బాబు అనే భక్తుడు "అమ్మా! మానవుడు తరించాలంటే భగవంతుడు కరుణించాలి. భగవంతుడు కరుణించాలంటే ఆయనను ఆరాధించాలి. తనను తరింపజేయమని వేడుకొనాలి. కానీ నాదొక సందేహం అమ్మా! భగవంతుడు సర్వజ్ఞుడు కదా! ఆయనకు అన్నీ తెలుసు. భక్తుని మనస్సులోని మోక్షాపేక్ష కూడా తెలుసు. అతని మోక్షాపేక్షను గుర్తించి భగవంతుడు అతనికి సహాయపడవచ్చు. ఎందుకంటే భక్తుడు తనంత తానుగా తనకోరిక చెప్పకున్నా ఆయనకు అన్నీ తెలుస్తాయి. ఇక అటువంటప్పుడు ప్రత్యేకంగా ఆయనను సహాయపడమని వేడుకొనవలసిన అవసరం యేముంది?" అన్నాడు. "గురువే దైవం. మోక్షసాధనకు గురువు అవసరం. స్వచ్ఛమైన హృదయంలో మాత్రమే దైవం ప్రకాశిస్తాడు. వినమ్రత నిరహంకారానికి చిహ్నం. సర్వజ్ఞుడైన గురువుకు నిరహంకారంతో శరణాగతుడు అవటం సాధనలో మొదటిమెట్టు" అన్నారు శ్రీ ఆనందమయి మాత. 'అంటే గురువు సర్వజ్ఞుడు కాబట్టి, నా మనస్సులో మోక్షాపేక్ష వున్నది కనుక వెంటనే ఆయన నాకు మోక్షాన్ని యిచ్చేయాలి' అని నీ ఉద్దేశమా? కేవలం కోరిక వున్నంత మాత్రాన సరిపోతుందా? అందుకు తగిన కృషి చేయాలి కదా? సాధన నియమ నిబంధనలన్నీ పాటిస్తూ కఠిన నిష్ఠతో చేస్తూ, సహాయపడమని భగవంతుని వేడుకొనటం కూడా అవసరం అని, కొంచెం సేపు ఆగి, అతనినే చూస్తూ అమ్మ "బాబుగారూ, చూడండి, నిజంగా నాకైతే యేమీ తెలియదు. నా చేత యేది పలికింపబడితే దానినే పలుకుతాను, అంతే" అన్నారు. కొన్ని క్షణాల మౌనం తర్వాత మళ్ళీ అమ్మ యిలా చెప్పనారంభించారు –

"భూమిలోపల విత్తనం గుప్తంగా యెంతకాలం

వున్నప్పటికీ విత్తనం యొక్క శక్తి ప్రకటం అవటం జరుగదు. నీరు, మట్టి, సూర్యరశ్మి యొక్క సహకారం స్పందన వలన మాత్రమే విత్తనం మొలకెత్తటం జరుగుతుంది. అప్పుడే భూమి లోపల వున్న విత్తనం నుండీ అంకురం భూమిని పగలకొట్టుకుని బయటకొస్తుంది. అలాగే 'నేను తరించాలి' అన్న కోరిక మనసులో బయలుదేరటమే భూమిలో నాటబడిన విత్తనం వంటిది అనుకొన్నట్లయితే, తరింపు కోసం తపిస్తూ మార్గం కోసం అన్వేషిస్తూ చేసే కృషిని – భూమిలో నాటబడిన విత్తనం 'నీరు, మట్టి, సూర్యరశ్మి' వీటితో కలసి స్పందించటం అని చెప్పవచ్చు. నిజానికి జీవాత్మ స్వయంప్రకాశం. అది తన సహజ స్థితిని చేరుకొనాలనే ఆశతోనే తగిన అవకాశం కోసం యెదురుచూస్తూ వుంటుంది. పరమాత్ముని కోసం తపన అనేది జీవుని సహజతత్త్వం. అది పొందటానికి చేసే కృషియే తపస్సు. తపస్సుతోనే తరింపు సాధ్యమౌతుంది. అందుకోసం భగవంతుని కరుణకై ఆయనను వేడుకొనటం అవసరం. పరమాత్మునికి పాదాక్రాంతులై ప్రార్థించటం అనేది సాధనలోని భాగం" అని వివరించారు అమ్మ.

ఈ చర్చ ముగిసేసరికి సాయంత్రం అయింది. స్త్రీలందరూ తమ తమ యిండ్లకు వెళ్ళిపోయారు. అప్పుడే ఆఫీసుల నుండి వుద్యోగస్థులు ఒక్కొక్కరు రావటం మొదలుపెట్టారు. ఆ రాత్రి భక్తులు తమ తమ సమస్యలనెన్నింటినో అమ్మకు విన్నవించుకున్నారు. రాత్రి ఒంటి గంట వరకు సంభాషణలు సాగాయి. ఆ తర్వాత భక్తులందరూ అమ్మ వద్ద సెలవు తీసుకొని యిళ్ళకు వెళ్ళిపోయారు.

మరల మరునాడు చాలామంది భక్తులు అమ్మను దర్శించారు. ఆరోజు ఒక కొత్త అంశం అమ్మ దృష్టికి తీసుకొని వచ్చారు భక్తులు. అదేమిటంటే కులగురువు వద్ద మంత్ర దీక్ష తీసుకొనటం అనేది అనివార్యమా, కాదా అన్న ప్రశ్న. కుల గురువు అయినంత మాత్రాన అతడు పరిపూర్ణుడు కానట్లయితే, అతని వద్ద దీక్ష తీసుకొనగూడదు అని కొందరు అభిప్రాయపడ్డారు. దీక్షాగురువు తపస్సంపన్నుడు కానప్పుడు దీక్షాప్రదానానికి అతడు అర్హుడు కాదేమోనన్న భావననే యెక్కువమంది భక్తులు అమ్మ వద్ద వ్యక్తం చేయటం జరిగింది. మరల కులగురువును పూర్తిగా ప్రక్కన పెట్టటం కూడా సమంజసం కాదేమో, పైగా అలాచేయటం దోషమేమోనన్న భయం కూడా వారిలో వున్నది.

ఈ సందర్భంగా బీజమంత్రం గురించిన చర్చ కూడా వచ్చింది. వారు శ్రీ ఆనందమయి అమ్మను యిలా ప్రశ్నించారు. "అమ్మా! ఎటువంటి బీజాక్షరాలతో వున్న యే యే మంత్రాలు మంత్రదీక్ష తీసుకొనేవారికి యివ్వబడతాయి? మంత్రదీక్ష యివ్వటానికి యెటువంటి గురువులు అర్హులు? అర్హులు కానివారితో మంత్ర దీక్ష స్వీకరించవచ్చా? అలా చేయటం వలన మంచి ఫలితం లభిస్తుందా?"

ఈ విధమైన భక్తుల సందేహాలకు శ్రీ ఆనందమయి అమ్మ యిలా సమాధాన మిచ్చారు. "చూడండి, మీరు తీయని ఫలాలను పొందాలనే వుద్దేశంతో ఒక పండ్ల చెట్టు విత్తనం తీసుకువచ్చి, మీ పెరట్లో ఒక చోట నాటారు అనుకుందాం. అయితే అది తీయని పండ్ల చెట్టు విత్తనం అని మాత్రమే మీకు తెలుసు కాని అది జామ విత్తనమో, మామిడి విత్తనమో, యిలా అది యే జాతికి చెందిన విత్తనమో మీకు తెలియదు. అయినప్పటికీ దానికి శ్రద్ధగా నీరు పోసి పెంచితే అది మొలకెత్తి పెరిగి పెద్దదై తీయని రుచికలిగిన ఫలాలనే కాస్తుంది. అంటే విత్తనం యే వృక్ష జాతికి చెందినదో తెలుసుకొని నాటితేనే మొలకెత్తి తీయని పండ్లను కాయటం అనేది జరుగదు కదా? అలాగే 'గురువుచే ప్రసాదింపబడిన బీజాక్షరం యేమిటి? ఏ దైవానికి సంబంధించినది? అనే విషయం సాధకుడికి తెలియవలసిన అవసరం లేదు. ఏ మంత్రమైనా అది ముక్తి ఫలాన్ని ప్రసాదించే భగవంతుని నామమే. కనుక గురువుచే ప్రసాదింపబడిన మంత్రం గురించి గాని, దాని బీజాక్షర వివరాలు, అర్థాలు గానీ సాధకుడు తెలుసుకోనక్కర్లేదు. మంత్రాన్ని శ్రద్ధతో జపిస్తే కాలక్రమేణా మంత్ర సిద్ధి తప్పక ప్రాప్తిస్తుంది."

**- సశేషం**

# ద్వారకామాయి అనుభవమండపము

*శ్రీ కాశిన సురేష్, విజయవాడ*

"నన్ను నమ్మినవాడిని ఎన్నటికీ పతనం కానివ్వను" అన్న సాయి సూక్తి ఆధారంగా నా జీవితం నడిచింది. విజయవాడలో ముత్యాలంపాడు సాయిబాబా గుడి దగ్గర మా ఇల్లు. నాకు మొదట్లో శ్రీ సాయినాథుని పట్ల ఏమాత్రము భక్తి వుండేది కాదు. మా కామేశ్వరి అక్క ద్వారా నాకు అంతటి భాగ్యం కలిగింది. మా ఇంట్లో అందరూ బాబా గుడికి వెళ్ళినా నేను మాత్రం ఎప్పుడూ వెళ్లేవాడిని కాదు. మా అక్క పోరు పెట్టగా పెట్టగా నెమ్మదిగా తనతో వుదయం కాకడ హారతి సేవకి వెళ్లడం మొదలు పెట్టాను. అక్కా నేను తెల్లవారు ఝామున 4-30 కి గుడికి వెళ్లి బాబాకి దోమతెర తీసే సేవ మొదలుకుని, అభిషేకం, అలంకరణ అంతా చేసేవాళ్ళం. అమ్మా నాన్నలతో సహా ఇంట్లో అందరం భక్తి శ్రద్ధలతో బాబావారిని సేవించేవాళ్ళం.

## కష్టకాలంలో బాబా భరోసా:

ఇలా జరుగుతున్న సమయంలో దాదాపు 25 సంవత్సరాల క్రితం మా కుటుంబం అంతా చాలా కష్టాలు పడ్డాము. మాకు బంగారం షాపు వుంది. కొన్ని కారణాల వల్ల వ్యాపారంలో నాన్నగారికి నష్టం వచ్చింది. దానివల్ల మా ఆర్థిక పరిస్థితి చాలా దిగజారి పోయింది. కనీస అవసరాలకు కూడా ఇబ్బంది కలిగే పరిస్థితులు వచ్చినప్పుడు తట్టుకోలేక, ఇంట్లో అందరూ క్రైస్తవంలోకి మారిపోదామని నిర్ణయించుకున్నాం. ఆ సందర్భంలో ఒకరోజు మా ఇంట్లోనే మా అమ్మకి సాయినాథులవారు ప్రత్యక్షంగా దర్శనమిచ్చి అమ్మతో, "నేను చేయలేనిది ఆయన చేస్తాడనా మీరు అటువైపు వెడుతున్నారు, కాస్త ఓపిక పట్టండి, నేనే సహాయం చేస్తాను, ఇప్పుడు ఎంత క్రిందకి వెళ్ళారో,, అంత పైకి తీసుకు వస్తాను" అని చెప్పి మాయమయ్యారట. ఊహించని ఈ అద్భుత సంఘటనకి ఇంట్లో అందరం ఆనందపరవశులమయ్యాము. ఇంతటి కష్టాల్లో వున్న మాకు, ఆ కరుణామయుడు ఇచ్చిన భరోసా మా విశ్వాసాన్ని బలపరచి, పరిస్థితులని తట్టుకునే శక్తినిచ్చింది. ఇక అప్పటి నించి వారి లీలా వినోదం మొదలయ్యింది. నేను అప్పుడు ఇంటర్ చదువుతున్నాను.

ఆర్థిక ఇబ్బందులవల్ల సొంత ఇల్లు అమ్మేసాక,, ఒక జడ్జిగారికి ఈవిషయం తెలిసి, మా నాన్న గారితో, 'మీరు మళ్ళీ కోలుకునేదాకా ఈ ఇంట్లో వుండండి, నాకు అద్దె ఇవ్వనవసరం లేదు' అని చెప్పి పది గదులున్న పెద్ద ఇల్లు మాకు ఇచ్చారు. ఇది సాయినాథుని అత్యంత కరుణకి నిదర్శనం.

## కష్టకాలంలో అంకుల్ రూపంలో బాబా చేయూత

ప్రతిరోజు వుదయమే మేము కాకడ హారతికి బాబా సేవకు వెళ్ళినప్పుడు ఒక అంకుల్ కూడా వచ్చేవారు కానీ వారు ఎవరితోనూ మాట్లాడేవారు కాదు. నేను ప్రతిరోజు బాబాకు పెట్టిన వెన్న నైవేద్యం ఆయనకు

కొంత ఇచ్చేవాడిని, అది తీసుకుని ఆయన వ్యాహ్యాళికి వెళ్ళిపోయేవారు. మా ఇంటి పరిస్థితులు బాగోని సందర్భంలో ఒకరోజు ఆయన నాతో "ఏం బాబు అలా వున్నావేంటి? ఆరోగ్యం బాగాలేదా? ఏమిటి సమస్య?" అని అడిగారు. నేను ప్రతిరోజు ఆయనని చూస్తున్న చనువుతో ఇంట్లో పరిస్థితి చెప్పాను. ఆయన వెంటనే, 'ఒకసారి మా షాపు కి రా' అని చెప్పి వెళ్ళిపోయారు. ఎందుకు పిలిచి వుంటారబ్బా అనుకుంటూ వారి షాపు కి వెళ్లాను. ఆయన, ఒక లక్ష రూపాయలు నాకు ఇచ్చి, 'ఇవి మీరు వుపయోగించుకొని, మళ్ళీ మీరు నిలదొక్కుకున్నాక వాటిని నాకు ఇవ్వండి, తొందర ఏం లేదు' అని చెప్పి, నేను తిరిగి మాట్లాడేలోపునే, 'ఎవరూ చూడకుండా తొందరగా ఇంటికి వెళ్ళిపో' అని నన్ను పంపించేశారు. 25 సంవత్సరాలు క్రితం లక్ష రూపాయలు అంటే తక్కువ డబ్బు కాదు. మర్నాడు వారు గుడికి వచ్చినప్పుడు, అంకుల్, మీరు ఎందుకు అంత సహాయం చేసారు అనడిగితే... 'నువ్వు బాగుండాలయ్యా' అన్నారు.

కొన్ని రోజుల తర్వాత అంకుల్ నాతో నీ పేరున SBI లో అకౌంట్ ఓపెన్ చేసి దాంట్లో నెలకి 2000,, చొప్పున కొన్నాళ్ళు వెయ్యమన్నారు. మా పరిస్థితి కొంచెం సర్దుకున్నాక వారు చెప్పినట్లే చేసాను. అలా బహుశా మూడేళ్లు దాటాక ఒకరోజు, ఇప్పుడు బ్యాంకులో ఎంత డబ్బు వుంటే అంత తీసుకొని రా అన్నారు. అప్పుడు 76000 వున్నాయి నేను వాటిని బ్యాంకు నుంచి తీసి ఆ మొత్తాన్ని ఆయనకి ఇచ్చాను. తర్వాత మిగతాది కూడా పూర్తి చేసి వారికి ఇద్దామని అనుకున్నాను. అయితే ఈ సంఘటన జరిగిన కొన్నాళ్లకి ఆయన నన్ను విజయవాడ దగ్గరలో 'కంద్రిక' అనే చోట కొత్తగా కట్టిన బాబా గుడికి వెళ్ళమన్నారు.. నాకు ఇక్కడ బాబా సేవ, చదువు, నాన్నగారికి వ్యాపారం లో తోడుగా వుండటం,,, వీటన్నీటితో అంత శ్రద్ధ పెట్టలేదు. కానీ ఒకసారి ఆయన నన్ను ఆ గుడికి వెళ్ళమని బాగా ఒత్తిడి చేశారు. సరేనని ఒకరోజు వెళ్ళాను. వాళ్ళు నాపేరు అడిగి, సురేష్ అని చెప్పగానే, నాకు కుర్చీ తెచ్చి వేసి కూర్చోమని చాలా మర్యాద చేశారు. "అదేంటండి నేను ఎప్పుడూ ఈ గుడికి రాను కదా, నాకు ప్రత్యేకంగా మర్యాద ఎందుకు చేస్తున్నారు?" అని అడిగాను. అప్పుడు వాళ్ళు, "ఈ గుడి అభివృద్ధికి, మీరు కొంత ఆర్థిక సహాయం చేశారని, మీ పేరు సురేష్ అని చెప్పి, ఒక ఆయన డబ్బులు తీసుకువచ్చి యిచ్చారు" అని చెప్పారు.

అది వింటూనే చాలా ఆశ్చర్య పోయాను. నాచేత ప్రతినెలా డబ్బులు జమ చేయించి, దాన్ని అంకుల్ ఇలా వినియోగిస్తారని కొంచెంకూడా ఊహించని కారణంగా,, ఈవిషయం విన్నాక దానినించి బైటికి రావడానికి చాలా సమయం పట్టింది. అప్పుడు అర్థం అవ్వలేదు కానీ, ఇప్పుడు ఆలోచిస్తే, మా ప్రారబ్దాన్ని తీర్చడానికి, సాయినాథులు వేసిన ప్రణాళిక అనిపిస్తుంది. తరవాత మేముకూడా నెమ్మదిగా కోలుకున్నాము.

ఆనాటి నించి ఈనాటికీ వారి సేవా భాగ్యాన్ని అనుగ్రహిస్తూనే వున్నారు. అదే గుడిలో పూజ్యశ్రీ మాస్టరుగారి విగ్రహ ప్రతిష్ట కూడా జరిగింది. వారికి కూడా ప్రతినిత్యం అభిషేకం అలంకరణ మొదలైన సేవలు చేసుకునే భాగ్యాన్ని ప్రసాదించారు.

తర్వాత బాబా నాకు ప్రత్యక్షంగా దర్శనమిచ్చి చాలా అనుభవాలని ప్రసాదించారు అందులో ఒకటి రెండు మీతో పంచుకుంటాను.

## అక్కల్ కోట సమాధి మందిరంలో సాయిబాబా దర్శనం

ఒకసారి నేను, మా అక్క కామేశ్వరి అక్కల్ కోట వెళ్ళాం. ఇది కూడా చాలా సంవత్సరాల క్రితం జరిగింది. అప్పుడు సమాధి మందిరం పక్కనే రెండు గదులు వుంటే, అక్కడ బస చేసాము. రాత్రి 11-30 గంటల తరువాత సమాధి మందిరం అంతా శుభ్రం చేస్తారు. అక్కడ దిగిన మొదటిరోజు నేనొక్కడినే రాత్రి సమాధి మందిరానికి వెడితే, అక్కడ సెక్యూరిటీ లోపల సేవ చేస్తూ వుంటే, నేను చేయవచ్చునా అని అడిగితే, సరే, చెయ్యమని, ఆ గది

తాళాలు నాకు ఇచ్చి, అంతా అయ్యాక తెచ్చి ఇవ్వమని అతను పడుకున్నాడు. నాకు ఎంతో ఆనందం వేసి, అంతటి సేవ ఇప్పించినందుకు బాబాకు కృతజ్ఞతలు చెప్పుకుంటూ, శ్రద్ధగా సేవ పూర్తిచేసి, సెక్యూరిటీకి తాళం ఇచ్చేసాను. మరునాడు మా అక్క కూడా రాత్రి 11-30 గంటలకి నాతో వచ్చింది. అతను మళ్ళీ మాకు సేవ ఇచ్చాడు. ఈసారి మా అక్కని చేసుకొమ్మని, నేను బైట నిల్చున్నాను. అక్కడ చాలా నిర్మానుష్యంగా వుంది. అప్పుడు తెల్లని వస్త్రాలు ధరించి బాబా ప్రత్యక్షమై, జోలెలోనించి ఒక లడ్డు తీసి నాకు ఇచ్చారు. నాకు దేహ స్ఫురణ లేదు. అలా తన్మయత్వంతో బాబాని చూస్తూ పాద నమస్కారం చేసుకున్నాను. ఈలోపు మా అక్క గుర్తుకు వచ్చి, “బాబా ఇక్కడే వుండండి నేను మా అక్కని తీసుకొస్తాను” అని ఒక్క పరుగుతో సమాధి మందిరం దగ్గరికి వెళ్లి తనని దాదాపు లాక్కుని వచ్చినంత పని చేశాను. తీరా అక్కడికి వచ్చేసరికి బాబా లేరు,,,ఇద్దరం చాలా ఆందోళనతో ఆ చీకట్లో చుట్టుపక్కలంతా వెతికాము, కానీ ఎక్కడా కనిపించలేదు.

## శబరిమలైలో ఆపద్బాంధవుడు

శ్రీ సాయి లీలామృతము గ్రంథంలో శబరిమలై యాత్రకు వెళుతున్న ఒకరికి కొండ ఎక్కలేకపోతే బాబా సహాయం చేసిన లీల మాదిరిగా నాక్కూడా అదే సందర్భంలో ఒక లీల జరిగింది.

నేను నా స్నేహితుడు శబరిమలై యాత్రకు వెళ్లి, యాత్రికులతో కలిసి కొండ ఎక్కుతూ, రద్దీ ఎక్కువగా వుండడం వల్ల ఇద్దరం విడిపోయాము. ఒక ప్రదేశం దగ్గర కలుస్తాము కదాని నేను నడుస్తున్నాను. నాకు కొంత దూరం వెళ్ళాక బాగా దాహం వేసింది. నోరు ఎండిపోయి కాలు కూడా కదపలేని పరిస్థితిలో వున్నాను. అయితే నా దగ్గర ఆహార పదార్థాలు గానీ తాగే పానీయాలు కానీ డబ్బులు కానీ ఏమీ లేవు. అవన్నీ నా స్నేహితుడి దగ్గర వున్నాయి. ఎవరిని అడిగే పరిస్థితి కూడా లేదు. విపరీతమైన దాహంతో మాట్లాడలేక, నడవలేక వున్న పరిస్థితిలో, నాకు శ్రీ సాయిలీలామృతంలో లీల గుర్తుకు వచ్చి,” బాబా! నాకు ఇప్పుడు సహాయం చేయలేకపోతే, ప్రాణం పోయేట్టు వుంది, నన్ను కాపాడు” అని ప్రార్థించాను. వెంటనే కొన్ని నిమిషాల్లోనే నా పక్కనే సాక్షాత్తు సాయినాథుడు ప్రత్యక్షమై, హిందీలో ఏదో అడిగారు. నేను మాట్లాడే పరిస్థితిలో లేక బొటనవేలు చూపించాను. అప్పుడు వారు నాకు తాగడానికి మంచి నీళ్లు ఇచ్చారు. ముందు నా ప్రాణాలు నిలుపుకోవాలన్న ఆతృతతో నేను గబగబా మంచినీళ్లు తాగాను అంతే ఒక్క నిమిషం సేపు నాకు వారి దర్శనాన్ని ప్రసాదించి మాయమైపోయారు. “ఆపద్బాంధవ సాయినాథా!” అని పాడుకుంటూ, రెట్టించిన వుత్సాహంతో కొండ ఎక్కి స్వామి దర్శనం చేసుకున్నాను.

## శిరిడీలో విజయదశమి భిక్ష

నేను, కామేశ్వరక్క, ఒక విజయదశమికి శిరిడీ వెళ్ళాము. ఇప్పుడు పరిస్థితి నాకు తెలియదు కానీ అప్పట్లో విజయదశమి ముందు రోజు, కొంతమందిని చీటీల ద్వారా ఎంపిక చేసి, విజయదశమి రోజు, బాబా భిక్షకు వెళ్లే ఐదు ఇళ్లకు భిక్షకు పంపేవారు. అప్పుడు నా పేరు కూడా చీటీ రాసి ఇచ్చాను కానీ, నాకు అవకాశం రాలేదు. విజయదశమి రోజు ద్వారకామాయి దగ్గర, వాళ్ళందరికి జోలెవేసి, వాళ్ల ఇళ్ళకి పంపిస్తే, వాళ్ళు వీళ్ళని సాయినాథునిగా భావించి, హారతి ఇచ్చి, భిక్ష ఇచ్చి పంపిస్తారు. నేను, అక్క, ఆ వుత్సవం చూడడానికి ద్వారకామాయి దగ్గరకి వెళ్ళాము. వరుసగా ఎన్నిక అయిన వారందరికీ జోలె వేస్తూ, అక్కడే వున్న నాకు కూడా వేశారు. నేను ఎంపిక కాలేదని చెప్పటానికి ప్రయత్నిస్తున్నా నా మాట వినిపించుకోలేదు. నాకు కూడా వారందరితో ఐదు ఇళ్లలో భిక్ష చేసే అవకాశం బాబా ప్రసాదించినందుకు కృతజ్ఞతాపూర్వక నమస్సులు మనస్సులో చెప్పుకుని భిక్షకి బయలుదేరాను.

ఇప్పటికీ ఎన్నో లీలలు, అనుభవాలు ప్రసాదిస్తూ నన్ను అనుగ్రహిస్తున్న సాయినాథునికి శత సహస్ర వందనాలు!! ●

# ఆచార్యుని అద్భుత లీలలు

*శ్రీమతి జయప్రద, గుంటూరు*

గుంటూరు వాస్తవ్యులు శ్రీమతి జయప్రదగారు పంచుకున్న పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి లీలావైభవం భక్తులలో భక్తిని, గురుదేవులపై నమ్మకాన్ని రెట్టింపు చేసేలా వుంది. **ఆయనను నమ్ముకున్న వాళ్ళకి ఏ లోటూ వుండదు. కష్టాలు వచ్చినా ఆయన మనతో వుండి దాటిస్తారు"** అంటూ సుదీర్ఘమైన అనుభవాల సారాంశాన్ని, అందులోని ముఖ్యాంశాలను ఈ విధంగా తెలియజేస్తున్నారు:

## గురువు లభించటం

మనకి జీవితంలో మూడు ముఖ్యమైన విషయాలు జరగాలని నాకు అనిపిస్తుంది. అవి ఏమిటంటే:--

1) మనపూర్వ జన్మ సంస్కారానికి తగిన గురువు దొరకాలి.

2) ఆ గురువు కూడా ఎంతటివారై వుండాలంటే, మనం ఏమిచేస్తే మనకర్మలు తొలుగుతాయో తెలిసిన వారై వుండాలి.

3) ఆయన చెప్పినది మనం సరిగ్గా ఆచరించగలిగి వుండాలి.

అలా ఈ మూడూ జరిగినప్పుడు మనకి గురువుకి బంధం ఎప్పటికి తెగిపోదు. అలా పూర్వ పుణ్యం వల్ల నాకు పూజ్యశ్రీ మాస్టరుగారు దొరికారు.

## శ్రీ సాయి లీలామృతం నిత్యపారాయణ

నన్ను ప్రతి రోజూ 'శ్రీ సాయి లీలామృతం' గ్రంథం నుంచి 11 పేజీలు పారాయణ చెయ్యమన్నారు. నేను టీచర్ జాబ్ చేసేదాన్ని. తరవాత ట్యూషన్స్ వుండేవి. ఇవి కాక ఇంటి వ్యవహారాలూ....... అస్సలు ఖాళీ వుండేది కాదు. పోనీ రాత్రి చదువుదామంటే, పగలంతా పనులతో అలసిపోయిన నాకు, గ్రంథం తెరవగానే, విపరీతంగా నిద్ర ముంచుకు వచ్చేది. అదే విషయం చెప్తే, పూజ్యశ్రీ మాస్టరుగారు ఏమాత్రం ఒప్పుకోలేదు, 'ఎటువంటి పరిస్థితులలోనైనా చదివి తీరాలి' అన్నారు, 'నిద్రలేవగానే, మంచం మీద కూర్చుని అది చదివాక, మిగతా పనులకు వెళ్ళు' అన్నారు... అంటే ఆ పారాయణ నా జీవితానికి యెంత అవసరమో అర్థమయ్యింది.

## నందదీపం గ్రంథం చదవమని చెప్పటం

ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు గుంటూరు వచ్చారు. మన సత్సంగ సభ్యులు శ్రీమతి ఉషగారి ఇంట్లో వున్నారు. అక్కడ జరిగే సత్సంగానికి నేనుకూడా వెళ్లాను. ఆరోజు పూజ్యశ్రీ మాస్టరుగారు చాలా తేజోవంతంగా వున్నారు. ఆయన సన్నిధి చాలా ఆనందంగా అనిపించింది. సత్సంగం పూర్తయిన తరువాత భోజనానికి లోపలికి వెడుతూ నా వైపుచూసి, "మరో నందదీపం చదువు" అన్నారు. నేను అది బాబాకి సంబంధించిన గ్రంథం అనుకున్నాను. తిరిగి వెళ్లిపోయేటప్పుడు "నేను ఒంగోలు వెళ్ళాక ఆ పుస్తకాలు పంపిస్తాను" అన్నారు. ఒక నెల తరవాత మళ్ళీ గుంటూరు వచ్చారు, అప్పుడు కూడా నన్ను చూసి, "ఏమ్మా, మరో నందదీపం చదివావా" అనడిగారు. 'లేదండి' అన్నాను. "మనవాళ్ళకి ఇమ్మని 50 పుస్తకాలు పంపించానే, ఇవ్వలేదా?" అన్నారు. నాదాకా రాలేదండి, వచ్చిన వెంటనే అయిపోయాయిట అన్నాను. "అయితే కావలి సత్సంగం వాళ్లకి రాసి తెప్పించుకోమ్మా" అన్నారు. నేనాపని చెయ్యలేదు,

ఎందుకంటే, అది బాబాకి సంబంధించినదని నా వుద్దేశం. కానీ అది పూజ్యశ్రీ మాస్టరుగారి గురించినదనీ, వారంటే ఏమిటో తెలియజేసేలా ప్రథమంగా వచ్చిన గ్రంథమని అప్పట్లో నాకు తెలియదు. ఆ గ్రంథం విడుదల అయ్యాక పూజ్యశ్రీ మాస్టరుగారు ఆరు నెలలు మాత్రమే శరీరంతో వున్నారు. వారు సమాధి అయినప్పుడు, నాకు చంటిపిల్ల వుండడం వల్ల నేను వెళ్ళలేకపోయాను. అమ్మ, చెల్లి వెళ్లారు. వాళ్లు తిరిగి వచ్చేటప్పుడు 'మరో నందదీపం' గ్రంథం తీసుకువచ్చారు. అది చదివాక నేను ఎంత ఏడ్చానంటే, ఇందుకా మాస్టరుగారు నన్ను చదవమన్నారు, అప్పుడే చదివి వుంటే, ఆయనేమిటో ఇంకా బాగా తెలిసివుండేదికదా! అని చాలా రోజులు ఏడ్చాను. ఆరోజు నా మనసులో కలిగే భావానికి అలా సమాధానం చెప్పారన్నమాట!

## వైవాహిక జీవితం-కష్టాలలో అండగా నిలవడం

పూజ్యశ్రీ మాస్టరుగారు నాతో "నీకు పెళ్లయ్యాక సమస్యలు వస్తాయి" అని చెప్పారు. "మీ ఆశీస్సులు వుంటే ధైర్యంగా అనుభవిస్తాను" అన్నాను. వారు అన్నట్లు గానే, పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి అయ్యాక చాలా సమస్యలు వచ్చాయి. అలాంటప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారి పటం దగ్గర చెప్పుకుని బాధపడేదాన్ని. అదేరోజు పూజ్యశ్రీ మాస్టరుగారు కలలోకొచ్చి "ఎందుకమ్మా బాధపడతావ్, నేనున్నానుగా" అనేవారు. తరవాత మనసెంతో తేలికపడేది. ఇలా ఎన్నో నిదర్శనాలు యిచ్చారు. వారి పటం ఇంట్లో వుంటే వారు వున్నట్లే! మా పాపకి 'నంద దీప' అని పూజ్యశ్రీ మాస్టరుగారే పేరు పెట్టారు. తాను ఇప్పుడు బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్ గా జాబ్ చేస్తోంది.

## కుమార్తె వివాహ నిశ్చయం

నేను నెలకి ఒక ఆదివారం, ఒంగోలు పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి మందిరానికి పొద్దున్నే వెళ్లి, పారాయణ చేసుకుని, సాయంత్రం దాకా సమయమంతా అక్కడే గడిపి, తిరిగి రాత్రికి గుంటూరు వచ్చేదాన్ని. అలా ఒకసారి వెళ్ళినప్పుడు, మా అమ్మాయికి పెళ్లి ప్రయత్నాలు మొదలు పెడదామనుకుంటున్నామని, ఎటువంటి సంబంధం అయితే బాగుంటుందో మీరే నిర్ణయించండని చెప్పుకుంటూ ఒక చీటీ రాసి దానిని సమాధి మీద వున్న వస్త్రం కింద వుంచి,,,,నేను పారాయణ ఇత్యాదులు చేసుకుంటున్నాను. సాయంత్రం సమాధి అలంకరణ మొదలైనప్పుడు, ఆ చీటీని తీసుకున్నాను. అలా తీసుకున్న వెంటనే నాకు మా చెల్లెలి దగ్గరనించి ఫోన్ వచ్చింది. "పాపకి మంచి సంబంధం వచ్చింది, మాట్లాడాలి రా" అని. వెంటనే మాస్టరుగారికి కృతజ్ఞతలతో నమస్కరించుకుని ఇంటికి బయలుదేరాను. అదే సంబంధం ఖాయం అయ్యింది.

## పూజ్యశ్రీ అమ్మగారి అనుగ్రహం

మా అమ్మాయి పెళ్లి కుదిరాక, పూజ్యశ్రీ మాస్టరుగారి ప్రతిరూపమైన అమ్మగారికి వస్త్రాలు సమర్పించుకుందామని, 2013 వ సంవత్సరంలో నాగోలుకి వచ్చాను. అమ్మగారి దర్శనానికై, నామనస్సు వువ్విళ్లూరుతున్నది. కానీ ఆరోజు పూజ్యశ్రీ అమ్మగారికి ఆరోగ్యం సరిగాలేక, దర్శనానికి రాలేదు. నాకు చాలా బాధవేసింది. కళ్ళనించి నీళ్లు ధారలు కడుతున్నాయి. ఈలోగా ఎవరో, "మీరు వచ్చిన పని కాయితం మీద రాసి లోపలకి ఇవ్వండి" అని సలహా ఇచ్చారు. నాతో కూడా వచ్చిన వాళ్ళు రాసి పంపించారు. మేము కొంతసేపు కూర్చుని బయలుదేరాము. ఈలోగా వేదమ్మ వచ్చి, "ఆంటీ, మీరు పంపించిన చీటీ అమ్మగారు చూసారు. ఆశీస్సులని చెప్పమన్నారు. ఒంట్లో బాగోలేక దర్శనానికి రాలేక పోయారు" అని చెప్పారు. కానీ నా మనస్సు సమాధాన పడలేదు. అమ్మ దర్శనం కలగలేదని ఏదో బాధ. ఇంటికొచ్చాక రోజూ పూజ్యశ్రీ మాస్టరుగారికి చెప్పుకుని బాధపడే దానిని. ఒకరోజు పూజ్యశ్రీ మాస్టరుగారి ముందు కూర్చుని చాలీసా చదువుతున్నాను. అమ్మగారి ద్వారా ఆశీస్సులు యిప్పించలేదని కళ్ళవెంట నీళ్లు కారుతున్నాయి. అసలు మాస్టరుగారు నన్ను పట్టించుకోవటం లేదేమోనని



అనుమానం వచ్చింది. అదేరోజు రాత్రి స్వప్నం వచ్చింది. అందులో నేను స్కూల్ నించి వచ్చి తలుపు తీసేసరికి దేవుడి రూంలో వెలుగు కనపడుతోంది. లైట్ తియ్యడం మర్చిపోయానేమోనని దేవుడి గది దగ్గరకి వచ్చాను. ఆ గదిలో పూజ్యశ్రీ అమ్మగారు పడుకుని వున్నారు. నేను వెంటనే నమస్కారం చేసుకున్నాను. అమ్మగారు లేచి కూర్చుని, పసుపుతో చేసిన పెద్ద గౌరీదేవిని నా చేతిలో పెట్టారు. మెలకువ వచ్చేసింది. ఆ విధంగా పూజ్యశ్రీ అమ్మగారు, మాస్టరుగారు ఆశీస్సులిచ్చినందుకు చాలా ఆనందం వేసింది. పెళ్లికూడా ఎంతో వైభవంగా జరిగింది. ఇప్పుడు మా అమ్మాయి వాళ్ళు నెథర్లాండ్స్ లో వుంటున్నారు.

## విదేశాలలోనూ గురుదేవుల రక్షణ

నేను పూజ్యశ్రీ మాస్టరుగారిని వేడుకున్నాను. 'నా బాధ్యతతో పాటు నా పిల్లల బాధ్యత కూడా మీదే. వాళ్ళు చాలా దూరం వెడుతున్నారు. వాళ్లకి కూడా మీ సంపూర్ణ రక్షణ వుండాలి' అని. పూజ్యశ్రీ మాస్టరుగారి అపార కరుణ వల్ల, వాళ్ళని కూడా అదేవిధంగా కాపాడుతున్నారు. దానికి సంబంధించిన ఒక లీల మీతో పంచుకుంటాను. నెథర్లాండ్స్ లో మా మనవడిని స్కూల్ లో జాయిన్ చేసారు. ఒకరోజు మా మనవడు స్కూల్ నించి బైటికి వచ్చి, అటువైపుకు వున్న వాళ్ళ నాన్నని చూసి "నాన్న" అని గట్టిగా పిలిచాడట. ఆ ప్రక్కనే వున్న ఒకాయన, అదివిని వీళ్లెవరో తెలుగు వాళ్ళల్లాగ వున్నారనుకొని పరిచయం చేసుకున్నారట. మా మనవడిని నీపేరేమిటి అని అడిగితే "దత్త" అన్నాడట. మీరు దత్త భక్తులా? అని మా అల్లుడిని అడిగితే, మా అత్తగారికి బాగా నమ్మకమని చెప్తూ, పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి చెప్పారట. ఆయన "నేను కూడా శ్రీ సాయి లీలామృతం, శ్రీ గురుచరిత్ర పారాయణ చేస్తాను" అని చెప్పి, వీళ్ళని తన కార్లో మా అమ్మాయి వాళ్ళ ఇంట్లో దింపి, ఆయన ఫోన్ నెంబర్ ఇచ్చి, 'ఏమైనా అవసరం వుంటే ఫోన్ చేయండి" అని చెప్పి వెళ్లారట. మా అమ్మాయి ఆవిషయం చెప్పగానే, నాకెంతో ఆనందం కలిగింది.

ఇక్కడ పూజ్యశ్రీ మాస్టరుగారి దయ ఏమిటంటే, మరునాడే వాళ్లకి ఆయన అవసరం వచ్చింది. మా అల్లుడుగారు పారిస్ నించి నెథర్లాండ్స్ కి, వేరొక ఆయన నెథర్లాండ్స్ నించి పారిస్ కి షిఫ్ట్ అయ్యారు. నెథర్లాండ్ లో ఖాళీ ఐన ఇల్లు టెంపరరీగా మా వాళ్లకి బ్రోకర్ ఎలాట్ చేసాడు. కొద్దిరోజులకే ఒక పెర్మనెంట్ ఇల్లు దొరికింది. ఒక ఆదివారం ఇల్లు మారటానికి నిర్ణయించుకుని, ముందురోజు క్యాబ్ మాట్లాడుకున్నారు. రెండు మూడు స్ట్రోలర్స్ లగేజ్ వుంది. అది క్యాబ్ లో పెట్టుకుని

వెళ్ళవచ్చు. మర్నాడు, సామానంతా సర్దేసుకుని, ఇల్లు లాక్ చేసి తాళాలు బ్రోకర్ కి ఇచ్చేసి, లగేజ్ తో కిందకి రాగానే, బ్రోకర్ వెళ్ళిపోయాడు. క్యాబ్ అతను అకస్మాత్తుగా నేను రానని చెప్పి వెళ్ళిపోయాడట. తిరిగి ఇంట్లోకి వెళ్లిపోదామంటే ఇంటితాళాలు లేవు. వీళ్ళకి ఏంచెయ్యాలో తోచలేదు. సమయానికి ముందురోజు పరిచయమైన ఆయన గుర్తొచ్చారట. ఇక వేరే దారి లేక ఆయనకి ఫోన్ చేశారట. వెంటనే ఆయన, "మీరేమి కంగారు పడకండి, నేను పారాయణ చేసుకుంటున్నాను, తొందరగా వచ్చేస్తాను" అని చెప్పి, కొంతసేపటికి వచ్చారట. మా వాళ్ళని కొత్త ఇంటికి చేర్చడమే కాకుండా, ఆరోజు వారి ఇంట్లోనే భోజనం కూడా ఏర్పాటు చేశారట. ఇప్పుడు వాళ్ళ కుటుంబం, వీళ్ళ కుటుంబం చాలా సన్నిహితంగా వుంటారు. ఇదంతా పూజ్యశ్రీ మాస్టరుగారి దయ! ఈ విధంగా వేరే దేశంలో కూడా ఆయన రాసిన గ్రంథాలు పారాయణ చేసేవాళ్ళు కలవడం పూజ్యశ్రీ మాస్టరుగారి కరుణ కాక మరేమిటి? మనస్ఫూర్తిగా చెప్తున్నాను, ఆయనని నమ్ముకున్న వాళ్లకి ఏ లోటూ వుండదు. ఒకవేళ కష్టాలు వచ్చినా, ఆయన మనతో కూడా వుండి వాటిని దాటిస్తారు. ఇది నా స్వానుభవం.

## విశ్వరూప దర్శనం - అద్భుత స్వప్నానుభవం

పూజ్యశ్రీ మాస్టరుగారు నాకు ప్రసాదించిన గొప్ప అనుభవాన్ని, మీతో పంచుకుంటాను. నాకొకసారి ఒక స్వప్నం వచ్చింది. అందులో నేను ఇంకొక ఇద్దరు సత్సంగ సభ్యులు కలసి బాబా లీలలు వున్న ఒక పుస్తకం చూస్తున్నాం. అందులో తమాషా ఏమిటంటే, ఏ లీల చదువుతున్నామో, అక్కడ ప్రత్యక్షంగా దృశ్యరూపంలో కనిపిస్తోంది. అంటే చెరువు దగ్గర బాబా కూర్చున్నారు అని వుంటే అక్కడ నిజంగా నీళ్లు, బాబా కనిపిస్తున్నారు. మేము చాలా ఆశ్చర్యపోయి ప్రతిలీల చూస్తున్నాము. మా పక్కనే మంచం మీద పూజ్యశ్రీ మాస్టరుగారు పడుకుని వున్నారు. ఇదంతా గమనిస్తూ, మాతో "మీకు ఇంతకన్నా అద్భుతమైన లీల చూపించనా?" అని అడిగారు. 'ఆ చూపించండి మాస్టారు" అని అందరం అటు తిరిగాము. పూజ్యశ్రీ మాస్టరుగారు, నోరు పెద్దగా తెరిచారు. పెద్ద వెలుగు కనిపించింది. అది మొత్తం అంతా ఆక్రమించింది. అందరం మాయమై పోయాము నాతో సహా. కానీ నాకు, నేను చూస్తున్నాను అన్న ఎరుక వుంది. బ్రహ్మాండమైన వెలుగు, అంతా ఆక్రమించింది. ఆశ్చర్యంగా అలా చూస్తూవుండగానే, మెలకువ వచ్చేసింది. అద్భుతమైన ఆ అనుభవంలోని అనుభూతి నించి చాలా రోజులవరకు బైటపడలేకపోయాను. ఆయన కానిది ఈ సృష్టిలో ఏది లేదనిపించింది.

## సత్సంగ ప్రచారం

ఇలా ఎన్నిచెప్పినా తక్కువే! మాకందరికి సత్సంగాలు చెయ్యడం నేర్పించారు. ఇళ్లల్లో, గుళ్ళల్లో సత్సంగాలు చేసేవాళ్ళం. జీర్ణమైన గుళ్ళల్లో సత్సంగాలు చేయించి, తిరిగి పూర్వ వైభవాన్ని, తెప్పించేవారు పూజ్యశ్రీ మాస్టరుగారు. ఆయన సమాధి అయ్యాక కూడా సత్సంగాలు చేయిస్తున్నారు. ఒకసారి గోదావరిజిల్లా వైపు వాళ్ళు, వారి ప్రాంతానికి నన్ను సత్సంగం చెయ్యడానికి రమ్మంటే, దూరం కదా అని, తాత్సారం చేస్తూవచ్చాను. ఒకరోజు వుదయమే "సత్సంగానికి వెళ్లి బాగా చెప్పు" అని పూజ్యశ్రీ మాస్టరుగారి గొంతు గట్టిగా వినిపించింది. నేను వెంటనే వాళ్లకి వస్తానని చెప్పాను. ఒకరోజు కోసం వెళ్లిన దానిని మూడు రోజులవరకు వుండి పోయాను. అంతలా పూజ్యశ్రీ మాస్టరుగారే నా చేత సత్సంగం చెప్పించారు. ప్రత్యేకంగా ఆశీస్సులిచ్చి పంపించారు. అందువల్లే అలా చెప్పగలిగాను.

అంతటి మహానుభావునికి సమకాలికులవ్వడం మేము చేసుకున్న అదృష్టం. ఇలా గురుదంపతుల సన్నిధి ప్రతిజన్మలోను అనుభవించే అదృష్టాన్ని ప్రసాదించమని మనసా వాచా కర్మణా వేడుకుంటూ అనేకానేక కృతజ్ఞతా పూర్వక ప్రణామములు సమర్పిస్తున్నాను.

జై సాయి మాస్టర్!!

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad - 500068, Phone: +91 7416041550
Branch Office : Kondalah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 8597233271

### శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ గురు చరిత్ర – శ్రీ సాయి లీలామృతము (బౌండ్) | ₹499.00 |
| శ్రీ గురు చరిత్ర | ₹249.00 |
| శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి | ₹149.00 |
| శ్రీ దత్తావతార మహాత్మ్యము | ₹75.00 |

### శ్రీ శిరిడీ సాయిబాబాపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతము | ₹249.00 |
| శ్రీ సాయి సన్నిధి | ₹199.00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము. | ₹119.00 |
| శ్రీ సాయినాథ పూజ | ₹49.00 |
| శిరిడీ హారతులు | ₹15.00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | ₹49.00 |
| శ్రీ సాయినాథ స్తవన మంజరి | ₹10.00 |
| సాయిని పూజించడం ఎందుకు? | ₹10.00 |
| సత్సంగము – భజన | ₹10.00 |
| సాయి సూక్తి – ఆచార్యవాణి | ₹20.00 |
| శ్రీ సాయి నిత్య సత్య వ్రతము<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹20.00 |

### ఇతర మహాత్ముల గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ స్వామి సమర్థ | ₹75.00 |
| శ్రీ తాజుద్దీన్ బాబా | ₹75.00 |
| అవధూత శ్రీ వెంకయ్య స్వామి | ₹99.00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | ₹75.00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | ₹75.00 |
| శ్రీ ఆనందమయి అమ్మ | ₹75.00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | ₹99.00 |
| శ్రీ గురు సిద్ధారూఢ స్వామి<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |
| అవధూత శ్రీ చివటం అమ్మ<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |

### అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| ఏది నిజం? | ₹49.00 |
| మతం ఎందుకు? | ₹49.00 |
| విజ్ఞాన వీచికలు | ₹99.00 |
| పరిప్రశ్న | ₹119.00 |

### ధ్యాన సంబంధమైన గ్రంథములు

| | |
|---|---|
| ధ్యానయోగ సర్వస్వము | ₹99.00 |
| బుద్ధ ధ్యాన హృదయము | ₹49.00 |

### ఆధ్యాత్మికత – తత్వచింతనా పూర్వక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | ₹199.00 |
| ఆధ్యాత్మిక జాగృతి<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹199.00 |

### ఇతర గ్రంథములు

| | |
|---|---|
| పురుషసూక్త రహస్యము | ₹49.00 |
| మనము – మన సంస్కృతి | ₹75.00 |

### పూజ్య భరద్వాజ గురుదేవులపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹149.00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ<br>(రచన : శ్రీమతి శ్రీదేవి) | ₹299.00 |
| మహా పురుషుడు<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹60.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –1<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –2<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| ఆచార్య అమృత లేఖావళి<br>(సంకలనం : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹199.00 |
| మరో నంద దీపం | ₹120.00 |
| మాస్టారు అమృత వాక్కులు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹99.00 |

### బాలల కొరకు విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| బాలల సాయి లీలామృతము<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹49.00 |
| బాలల సాయిసన్నిధి<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |
| బాలల శ్రీ గురు చరిత్ర<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |

### BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba The Master | ₹249.00 |
| Shri Guru Charitra | ₹149.00 |
| Supreme Master | ₹149.00 |
| Tajuddin Baba | ₹149.00 |
| Sai Baba and His Teachings | ₹149.00 |
| Children's Sai Baba The Master<br>*(Author: Smt. Adidam Vedavati)* | ₹80.00 |

### BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sri Sai Baba (Hindi) | ₹249.00 |
| Sri Guru Charitra (Hindi) | ₹249.00 |
| Sri Sai Leelamruthamu (Kannada) | ₹249.00 |
| Sri Sainatha Prabodhamruthamu (Kannada) | ₹149.00 |
| Sri Guru Charitra (Kannada) | ₹199.00 |
| Sri Sai Sannidhi (Kannada) | ₹249.00 |
| Tibet Yogi Milarepa Charitra (Kannada) | ₹119.00 |
| Sri Swami Samartha (Kannada) | ₹119.00 |
| Sri Sai Leelamruthamu (Tamil) | ₹249.00 |
| Sri Guru Charitra (Tamil) | ₹299.00 |
| Sri Shirdi Sai Aartulu (Tamil) | ₹29.00 |
| Sri Sainatha Stavana Manjari (Tamil) | ₹20.00 |
| Sri Sai Leelamruthamu (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Odiya) | ₹299.00 |
| Sri Sai Sannidhi (Odiya) | ₹249.00 |
| Sri Swami Samartha (Odiya) | ₹75.00 |


# నేను దర్శించిన మహాత్ములు

# శ్రీ ఆనందమాయి అమ్మ



ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Postal Registration Number : Prakasam/2026-2028, Regd. No. APTEL/26/A0220



# శ్రీ సిద్ధారూఢ స్వామి ఆరాధన

ఆగస్టు 21, 2026

This periodical is published by Revuri Seshachala Sasidhar from Ongole on behalf of Ekkirala Vikramaditya, edited by Revuri Seshachala Sasidhar and printed by Janatha Offset Printers at Nirmal Nagar, Ongole".
[according to the Press and Registration of Periodicals (PRP) Act, 2023].